RNI : APTEL 2012/47045
Post Regd No. GTR/79/2024-26

# సత్యాగ్రహం

SATYAGRAHAM

దిన పత్రిక

Estd. 2009

Pubilshing from GUNTUR, KAKINADA

VAISHNAVI CREATIONS
Interior & Exterior Contractors
Turnkey Interior Contractors for :
❖ Rockwool / Puff Panel Works ❖ Structure Works ❖ ACP Cladding Works ❖ Glazing Works ❖ Glass Works ❖ Aluminium Windows & Doors etc. ❖ False Ceiling & Flooring Works ❖ Wooden Cup Boards ❖ Modular Kitchens & More...
P.Laxmi Narayana
✆ 9849006222, 9030767719 ✉ vcic99@gmail.com

సంపుటి : 14 సంచిక : 46 ఎడిటర్ : పొత్తూరి శ్రీనివాసరావురి B.A., LL.B. తెలుగు డైలీ గుంటూరు తేది : 01-03-2025 శనివారం పేజీలు : 8 వెల : రూ. 1/-

## ఏపీ బడ్జెట్

# రూ.3.22 లక్షల కోట్లు

### అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి పయ్యావుల



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల అసెంబ్లీ లో ప్రవేశపెట్టారు. నిర్ణయించిన ముహూర్తం ప్రకారం 10.08 గంటలకు మంత్రి బడ్జెట్ ప్రసంగంమొదలు పెట్టారు. ప్రభుత్వం ఏర్పడ్డాక కూటమి సర్కార్ తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 322359 కోట్లతో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర బడ్జెట్ తొలిసారి 3 లక్షలు కోట్లు దాటింది. సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీలకు, అభివృద్ధి పనులకు ఎక్కువ కేటాయింపులు జరపాల్సి రావడంతో 3 లక్షల కోట్లు దాటింది. రెవెన్యూ వ్యయం 251162 కోట్లు కాగా రెవెన్యూ లోటు 33185 కోట్లు ఉంది. ద్రవ్య లోటు 79926 కోట్లు ఉంది. మూల ధన వ్యయం 40635 కోట్లు గా ఉంది. బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కీలక కామెంట్లు చేసారు. గత ప్రభుత్వ తప్పిదాలను, నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండ గట్టారు. వైసీపీ ప్రభుత్వ ఆర్థిక అరాచకత్వాన్ని హిరోషిమాపై అణుదాడితో పోల్చారు. తమ పిల్లలభవిష్యత్ కోసం 2024ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు అద్భుత మైన తీర్పు ఇచ్చారని వెల్లడించారు. చంద్రబాబు తొలిసారి సీఎంఅయినప్పుడు ఉమ్మడి రాష్ట్రం లో పరిస్థితులు ఎంత దారుణంగా ఉండేవో ఇప్పుడూ అంతకు మించిన స్థాయిలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయన్నారు. అప్పులు చేయడమే తప్ప అప్పులు తీర్చడాన్ని మరిచిన గత ప్రభుత్వ తప్పుడు విధానాలను సరి చేస్తున్నామని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో కాంట్రాక్టర్లే రాష్ట్ర ప్రభుత్వాన్ని బ్లాక్ లిస్టులో పెట్టారని తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరపకపోవడంతో అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు గత ప్రభుత్వంలో ముందుకు రాలేదన్నారు. రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు, రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లు, ద్రవ్యలోటు రూ.79,926 కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.13,487 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.3,806 కోట్లు, ఎస్సీల సంక్షేమానికి రూ.20,281 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.8,159 కోట్లు, బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు, అల్పసంఖ్యాక వర్గాల కోసం రూ.5,434 కోట్లు, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖకు రూ.1,228 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రూ.2,506 కోట్లు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.18,847 కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,156 కోట్లు, ఇంధన శాఖకు రూ.13,600 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.8,785 కోట్లు, యువజన పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు, గృహ మంత్రిత్వశాఖకు రూ.8,570 కోట్లు, తెలుగు భాష అభివృద్ధి, ప్రచారం కోసం రూ.10 కోట్లు, మద్యం, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం కోసం నవోదయ 2.0 కార్యక్రమానికి రూ.10కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం రూ.6,300 కోట్లు, పోలవరం కోసం రూ.6,705 కోట్లు, జల్‌జీవన్ మిషన్ కోసం రూ.2800 కోట్లు, తల్లికివందనం కోసం రూ.9,407 కోట్లు.

## రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునాదిలా బడ్జెట్

- బీసీ వర్గాల సంక్షేమానికి రూ.47,456 కోట్లు
- మే నుంచి మొదలయ్యే సూపర్ సిక్స్ పథకాలకు భారీ కేటాయింపులు
- స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు రోడ్‌మ్యాప్‌గా నేటి బడ్జెట్
- 2025-26 రాష్ట్ర బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందనూ



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా తమ ప్రభుత్వం నిత్యం పనిచేస్తోందని... దానిలో భాగంగా 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణానికి పునాదిలా నిలుస్తుందని దృఢంగా నమ్ముతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత పాలకుల విధ్వంస పాలనలో నిర్వీర్యమైన వ్యవస్థలను నిలబెట్టేందుకు ప్రతి క్షణం పనిచేస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి ఆర్థిక సవాళ్లు ఉన్నా... 8 నెలల కాలంలోనే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, దీపం వంటి పథకాలతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన 93 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 74 పథకాలను ఇప్పటికే ప్రారంభించాం అన్నారు.

### రాష్ట్ర గతిని మార్చే బడ్జెట్

బడ్జెట్ అంటే కేవలం ఆయా శాఖలకు చేసే కేటాయింపులుగానే చూడకుండా,

4లో...

## పోలీసుల్లో స్థైర్యం నింపిన బడ్జెట్ కేటాయింపులు

- హోంమంత్రి వంగలపూడి అనిత
- గతంలో ఎప్పుడూ లేనంతగా హోంశాఖకు రూ.8,570 కోట్ల కేటాయింపులు
- 'ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఆఫ్ లా ఎన్ ఫోర్స్ మెంట్ (ఈగల్)' ఏర్పాటు
- ఇప్పటికే చెల్లించిన పెండింగ్ బకాయిలు రూ.250 కోట్లు
- 6,100 మంది పోలీసు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ పూర్తికి చర్యలు
- ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్ దిశగా అడుగులు
- రూ.61.20 కోట్లతో పోలీస్ దళం ఆధునీకరణ పథకం పునరుద్ధరణా
- గంజాయి,డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు 'నవోదయం 2.0'
- సవాళ్లను అధిగమించడంలో చంద్రబాబుకు సాటిలేరు



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : కూటమి ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ అన్ని రంగాలకు తిరిగి ఊపిరి పోసిందని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేనంతగా హోంశాఖకు రూ.8,570 కోట్లు బడ్జెట్ లో కేటాయించడం పోలీసుల్లో స్థైర్యం నింపిందన్నారు. శాంతిభద్రతల బలోపేతంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పోలీస్ శాఖలో కనీస అవసరాలకు కూడా పైసా విదల్చకుండా గత ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. సామాన్యులు ప్రశాంతంగా బతకలేని విధంగా వైఎస్ జగన్ ఐదేళ్ల విధ్వంస పాలన సాగిందన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించడమే లక్ష్యంగా ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు హోంమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా హోంశాఖలో పేరుకుపోయిన రూ.920 కోట్ల పెండింగ్ బకాయిలలో ఇప్పటికే రూ.250కోట్లు చెల్లించినట్లు హోంమంత్రి స్పష్టం చేశారు. 'గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ'ని పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. 'ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఆఫ్ లా ఎన్ ఫోర్స్ మెంట్ (ఈగల్)' ఏర్పాటుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినందుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐ.టీ, విద్యా శాఖ మంత్రి లోకేశ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ దళం

4లో...

## రైతులను స్థితిమంతులుగా చూడాలి

- బడ్జెట్లో వ్యవసాయానికి రూ.48,341.14 కోట్లు
- దేశం, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేది వ్యవసాయం
- అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : దేశం, రాష్ట్రం అభివృద్ధికి దోహదపడేది వ్యవసాయం అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో భాగంగా వ్యవసాయ బడ్జెట్‌ను ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రైతులకు మనసారా నమస్కరిస్తూ వ్యవసాయ బడ్జెట్‌ను సభ ముందుంచారు. ప్రధాన వనరైన వ్యవసాయాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించామని మంత్రి అచ్చెన్న అన్నారు. రైతులను స్థితిమంతులుగా చూడాలని ఆకాంక్షిస్తూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ 2047కు అనుసంధానంగా ఏపీని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి అచ్చెన్న తెలిపారు. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు 22.86 శాతంగా నమోదైందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం భూసార పరీక్షలను పూర్తిగా విస్మరించిందని కానీ ప్రభుత్వం 2024-25లో రూ.13.09 కోట్లతో 4.30 లక్షల భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందించామని వెల్లడించారు. అలానే 2025-26లో 6 లక్షల భూసార పరీక్ష పత్రాలు రైతులకు అందించేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. 2025-26లో 41.38 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరాకు చర్యల తీసుకుంటున్నట్లు మంత్రి అచ్చెన్న తెలిపారు.

### రూ.48,341.14 కోట్లతో వ్యవసాయ బడ్జెట్

విత్తన రాయితీ పంపిణీకి రూ.240 కోట్లు, ఎరువుల బఫర్ స్టాక్ నిర్వహణకు రూ.40 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.61.78 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.219.65 కోట్లు, రైతులకు వడ్డీలేని రుణాల కింద రూ.250 కోట్లు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం అమలుకు రూ.9,400 కోట్లు, ఉచిత పంటల బీమా కోసం రూ.1,023 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.12,401.58 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.930.88 కోట్లు, పట్టుపరిశ్రమకు రూ.96.22 కోట్లు, సహకార శాఖకు రూ.239.85 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,112.07 కోట్లు, మత్స్య రంగానికి రూ.540.19 కోట్లు, ఎన్జీ రంగా వర్సిటీకి రూ.507.01 కోట్లు, వైఎస్సార్ వర్సిటీకి రూ.98.21 కోట్లు, ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి రూ.154.57 కోట్లు, ఏపీ ఫిషరీస్ వర్సిటీకి రూ.38 కోట్లు, ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకానికి రూ.12,773.25 కోట్లు, ఉపాధి హామీకి రూ.6,026.87 కోట్లు, ఎన్టీఆర్ జలసిరికి రూ.50 కోట్లు, నీటివనరుల శాఖకు రూ.12,903.41 కోట్లు.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టాలెక్కించే బడ్జెట్ ఇది

- సంక్షేమం, సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా కేటాయింపులు జరిపారు
- రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు తగ్గించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్న పవన్



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక పద్దు సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు తగ్గించే చర్యలు చేపట్టిందని వెల్లడించారు. బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తుకు భరోసానిచ్చేలా, అభివృద్ధికి బాటలు వేసేదిగా ఉందన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టాలెక్కించే విధంగా ఉందన్నారు. సూపర్‌సిక్స్ హామీల అమలుకు తగిన కేటాయింపులు జరిపారని పవన్ కల్యాణ్ తెలిపారు. సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వ విధానాన్ని తెలియజేస్తుందన్నారు. తల్లికి వందనం పథకం, అన్నదాత సుఖీభవ పథకాల అమలుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని వివరించారు. గ్రామీణాభివృద్ధికి భారీ కేటాయింపులు ద్వారా పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకుంటాయని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పథకం పొడిగింపు ద్వారా రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వివరించారు.

## మార్చి నెల చివరి నాటికి నామినేటెడ్ పదవుల భర్తీ

- మహానాడు నాటికి పార్టీ కమిటీల పూర్తి
- పక్కన తిరిగేవారిని కాదు...పార్టీ కోసం పనిచేసేవారిని రికమండ్ చేయండి
- పార్టీలో ఏ స్థాయి నేతైనా కుటుంబ సాధికార సారథిలో ఉండాలి.
- కార్యకర్తలకు రుణపడి ఉంటా...5 ఏళ్లు అరచకాలను తట్టుకుని నిలబడ్డారు.
- సుదీర్ఘ రాజకీయాల్లో ఉండాలంటే నిత్యం ప్రజల్లో ఉండాలి
- ప్రత్యర్థులకు అవకాశం కలిగేలా ఎమ్మెల్యేలు, ఎంపీలు మాట్లాడొద్దు
- వివేకా హత్య ఘటన కుట్ర రాజకీయాలకు ఒక కేస్ స్టడీ
- కుట్ర, మోసం, ఫేక్ రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకున్న వాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలి
- టీడీపీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు కీలక సూచనలు చేసిన సీఎం



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : మార్చిలోగా నామినేటెడ్ పదవులు, మే నెలలో జరిగే మహానాడు నాటికి పార్టీ కమిటీలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నామినేటెడ్ పదవులకు ఎమ్మెల్యేలతో తిరిగే వారిని కాకుండా పార్టీ కోసం కష్టపడ్డవారిని ఎంపిక చేయాలని సూచించారు. ఆలయ కమిటీ ఛైర్మన్, ఏఎంసీలు కమిటీలు మార్చిలోపు పూర్తి చేస్తామని అన్నారు. సమర్థులకే కో-ఆపరేటివ్ అధ్యక్ష పదవులు ఇవ్వాలని, ఎమ్మెల్యేలు, ఎంపిలు నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదనలు పోర్టల్‌లో వెంటనే పెట్టాలని, మీరు



4లో...

## విద్య, వైద్యం, పంచాయతీరాజ్‌కు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు

- రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ ప్రజాహితంగా ఉందన్న ఎంపీ పురందేశ్వరి
- బీజేపీ ఎమ్మెల్యేలు బడ్జెట్ చర్చల్లో పాల్గొని తమ వాణి వినిపిస్తారని వెల్లడి




విజయవాడ, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ప్రజాహితంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విద్య, వైద్యం, పంచాయతీరాజ్ శాఖలకు పెద్దపీట వేశారని అభిప్రాయపడ్డారు. ఐదేళ్ల కాలంలో విచ్చిన్నమై అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఆది నుంచి తగిన సహకారం అందిస్తోందని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు బడ్జెట్ చర్చల్లో పాల్గొని తమ వాణి వినిపిస్తారని తెలిపారు. మొదటి నుంచి తమ పార్టీ అధినేత అమిత్ షా సూచించినట్లుగా భారతీయ జనతా పార్టీ ప్రజల వాణిగా ఉంటుందని పురందేశ్వరి అన్నారు. విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని అమ్మ ఆసుపత్రి వైద్యులు దుర్గా శ్రీలక్ష్మి, పవన్ కుమార్‌తోపాటు చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీదేవిలకు స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పిన పురందేశ్వరి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ పురందేశ్వరి మాట్లాడారు. ప్రజల సమస్యలపై నిర్మాణాత్మకంగా తమ పార్టీ సభ్యులు ప్రస్తావిస్తారని ఎంపీ అన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం మచ్చలేని పాలన అందిస్తోందని అన్నారు. ఇటీవల ఇండియాటుడే నిర్వహించిన సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీ 52 శాతం ఓట్లు సాధిస్తుందని ఎంపీ అన్నారు. పార్టీ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ వారి ఆశీర్వాదానికి నిదర్శనమని చెప్పారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని పునర్ నిర్మించే దిశగా బడ్జెట్ ఉందని ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి తెలిపారు. ఇది దిద్దుబాటు బడ్జెట్‌గా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నా సాయం తీసుకునేందుకు తమ వాటా నిధులు ఇవ్వలేని స్థితిలో గత ప్రభుత్వ పాలన ఉందని అన్నారు. కాని ఇప్పుడు ఆగిన ఆ 74 పథకాలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు.

# సంపాదకీయం...

## ధరాభారం.. మద్దతు దూరం

దేశానికి రైతే వెన్నెముక అంటూనే, ఆ వెన్నెముకను విరిచే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. అధికార మార్పిడి జరిగిన నాటి నుండి నేటి వరకు రైతాంగ ప్రయోజనాలు కాపాడే వ్యవసాయ విధానాలను పాలక పార్టీలు, ప్రభుత్వాలు అమలు జరపకపోగా హరిస్తున్నాయి. పండించే పంటలకు న్యాయమైన ధర లభించకపోతే రైతుకు నష్టదాయకంగా మారి సేద్యమే సంక్షోభంలో పడుతున్నది. నేడు భారత రైతాంగం ఈ సమస్యనే ఎదుర్కొంటున్నారు. నెహ్రూ పాలనలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే విధానాలు అమలు చేయని ఫలితంగా దేశంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. అవమానకరమైన పిఎల్ 480 ఒప్పందం ద్వారా అమెరికా నుండి పెద్దఎత్తున గోధుమలు దిగుమతి చేసుకున్నాం. ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచే విధంగా రైతాంగానికి మేలు రకమైన విత్తనాలు, పంటకు కావాల్సిన పెట్టుబడి, నాణ్యమైన ఎరువులు, మంచి ధర లభించే మార్కెట్ సౌకర్యం కల్పించి ఉంటే ఆహార సంక్షోభం వచ్చేది కాదు. మద్దతు ధరల నేపథ్యం భారత వ్యవసాయరంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి అనుగుణమైన విధానాలను అమెరికా అమలు జరిపింది. మొదట ముక్కిపోయిన గోధుమలను భారత దేశానికి ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంది. తమ దేశ ఎరువుల రంగానికి భారత దేశాన్ని పెద్ద మార్కెట్‌గా మార్చే వ్యూహాత్మక విధానాలకు సిద్ధమైంది. అందుకు ఫోర్డు ఫౌండేషన్‌ను ఉపయోగించింది. 1959లో భారత దేశానికి వచ్చిన ఈ ఫౌండేషన్ నాట్లు వేయటానికి ముందే పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని భారత ప్రభుత్వానికి సూచించింది. దానికి అనుగుణంగానే వ్యవసాయ ధరల కమిషన్ ఏర్పాటు కోసం 1964లో ఎల్‌కె ఝా అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. దాని సిఫార్సుల ఆధారంగా 1965లో వ్యవసాయ ధరల కమిషన్ (ఎపిసి) ఏర్పడింది. ఇది ప్రతి సంవత్సరం మద్దతు ధర, సేకరణ గురించి ప్రకటిస్తుంది. ఎపిసిని 1985లో వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చింది. ముందుగానే మద్దతు ధర ప్రకటించమని ఫోర్డు ఫౌండేషన్ చెబితే, పంటల దిగుబడి పెంచటానికి సస్యవిప్లవం ప్రకటించమని ప్రపంచబ్యాంకు భారత ప్రభుత్వానికి చెప్పింది. సస్యవిప్లవం పేరుతో అమెరికా కంపెనీల ఎరువుల, పురుగు మందుల వ్యాపారానికి భారత దేశాన్ని ముఖ్య కేంద్రం గా మార్చటమే ప్రపంచ బ్యాంకు ఎత్తుగడ. ప్రపంచ బ్యాంకు సూచనలకు అనుగుణంగా 1966లో దేశంలో సస్యవిప్లవాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా నుంచి హైబ్రీడ్ విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు దేశంలోకి దిగుమతి అయ్యాయి. సస్యవిప్లవ ఫలితంగా రైతాంగానికి పంట ఖర్చులు పెరిగాయి. అందుకు తగ్గ ఆదాయం మాత్రం రైతాంగానికి లభించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలకు మద్దతు ధర అంశం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా జరుగుతున్న చర్చ లో విధాన నిర్ణేతలు, పరిశోధకులు, ఆలోచనాపరులు ప్రభుత్వ పెట్టుబడులు లేదా ఇన్‌పుట్ సబ్సిడీల ద్వారా ఉత్పత్తి వ్యయానికి మద్దతు మార్గాలను సూచించారు. 1964లో ఎల్‌కె ఝా కమిషన్ సిఫార్సుల మేరకు రైతాంగానికి మద్దతు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం స్వీకరించింది. ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర విధానం ఒక నిర్దిష్ట పంట ఉత్పత్తి వ్యయాన్ని అంచనా వేయటానికి అనుసరించే విధానాలను వ్యవసాయ ఖర్చుల ధరల కమిషన్ (సిఎసిపి) ప్రచురించిన వార్షిక ధరల విధాన నివేదిక లో పేర్కొన్నారు. ఈ నివేదిక ప్రకారం సిఎసిపి భారత దేశంలో ప్రధాన పంటల సాగు ఖర్చును అధ్యయనం చేయటానికి 'సమగ్ర పథకాన్ని' 1971 నుండి అమలు చేసింది. ఈ పథకం ద్వారా మూడు సంవత్సరాల ఖర్చులను కలిపి పంటల ఉత్పత్తి ఖర్చును వ్యవసాయ ధరల కమిషన్ నిర్ణయిస్తుంది. ఈ విధానం రైతాంగ ప్రయోజనాలను దెబ్బ తీస్తుంది. రెండు సంవత్సరాల పంట ఖర్చులు తక్కువా ఉంటే, ఆ ఖర్చును మూడవ సంవత్సరం పంట ఖర్చులతో కలిపి నిర్ణయించటం వలన పంట ఖర్చు తక్కువగా నమోదు అవుతుంది. దాన్ని ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర తక్కువ ప్రకటిస్తుంది. అంతేకాకుండా పంటల ఉత్పత్తి ఖర్చును రాష్ట్రాల వారీగా సేకరించి దానిని దేశ సగటుగా నిర్ణయించటం జరుగుతున్నది. ఒక పంటకు సాగు ఖర్చులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉంది. దీనివల్ల ఎక్కువ ఖర్చు ఉన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతున్నది. ప్రతి సంవత్సరం రాష్ట్రాల వారీగా పంట ఖర్చును లెక్కించి ఆయా రాష్ట్రాలకు విడిగా మద్దతు ధరను ప్రకటిస్తే రైతాంగానికి ప్రయోజనంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అలా చేయకపోవటం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఒక పంటకు ఉత్పత్తి వ్యయం అనేది పంట కోసం పెట్టిన ఖర్చు, భూమి అద్దె, కుటుంబ శ్రమ, అప్పులకు వడ్డీ, మూలధనంపై వడ్డీ తదితరాలు లెక్కించి నిర్ణయించాలి. అది సమగ్రంగా ఖర్చుగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వాలు, వ్యవసాయ వ్యయ ధరల కమిషన్ ఆ విధంగా పంట వ్యయాన్ని లెక్కించటం లేదు. బ్యాంకులు ఇచ్చే పంట రుణం ప్రామాణికంగా తీసుకుని పంటకు మద్దతు ధరను ప్రకటిస్తున్నాయి. ఫలితంగా రైతాంగానికి సేద్యం గిట్టుబాటుకాక అప్పుల్లో కూరుకు పోతున్నారు. వివిధ కమిషన్ల సూచనలు: ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు కమిషన్ (ఎన్‌సిఎఫ్) కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) సగటు ఉత్పత్తి వ్యయంకంటే (పంట ఖర్చు, కౌలు ఖర్చు, కుటుంబ శ్రమ, అప్పులకు వడ్డీ మొదలైన ఖర్చులు) కనీసం 50% ఎక్కువగా ఉండాలని సిఫార్సు చేసింది. 1979 -80లో ఉత్పత్తి వ్యయం అంచనాలపై ప్రత్యేక నిపుణుల (యస్‌ఆర్ సేన్) కమిటీ, 1990లో ఏర్పాటు చేయబడిన పంటల ఉత్పత్తి వ్యయ పద్ధతి సమీక్ష కోసం నిపుణుల (సిహెచ్ హనుమంతరావు అధ్యక్షతన) కమిటీ, పంటల వ్యయం గురించి సిఎసిపి ఉపయోగించిన పద్ధతికి సంబంధించిన అనేక సమస్యలు లేవనెత్తాయి. సేన్, భాటియా (2004) కమిటీలు కూడా యాజమాన్యంలోని భూమి అద్దె విలువను కూడా ఉత్పత్తి వ్యయంలో లెక్కించబడుతుందని ఎత్తిచూపారు. భూయజమాని మూలధనంపై వడ్డీ ఖర్చు 10%గా అంచనా వేసింది. ఈ సిఫార్సులను ప్రభుత్వాలు, సిఎసిపి పరిగణనలోకి తీసుకోలేదు. 2014లో మోడీ నాయకత్వాన మొదటిసారి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడినప్పుడు 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పింది. ఇంతవరకు ఆచరణలో అమలు జరగకపోగా నేడు దాని ఊసే ఎత్తటం లేదు. రైతుల ఆదాయం పెరగకపోవటం పైన, మద్దతు ధరల పైన మోడీ ప్రభుత్వంపై వివిధ రూపాల్లో వ్యతిరేకత పెరుగుతూ ఉండటంతో, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పంట ఉత్పత్తి వ్యయంపై అదనంగా 50% పెంచి మద్దతు ధరను ప్రకటిస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడే మోడీ ప్రభుత్వ వంచన బయటపడింది. స్వామినాథన్ కమిషన్ చెప్పినట్లు అన్ని రకాల ఖర్చులను లెక్కించకుండా, ఒక్క పంట ఖర్చునే తీసుకుని దానిపై 50% పెంచి మద్దతు ధరను ప్రకటిస్తున్నది. 2024 -25 సంవత్సరానికి ఎకరా సేద్యపు పంట ఖర్చు 28 వేలుగా నిర్ధారించి, సగటు దిగుబడి 20 క్వింటాళ్లు నిర్ణయించి, క్వింటాల్ ఉత్పత్తి ఖర్చు రూ. 14 వందలు పేర్కొని దానిపై 50% పెంచి 2100 రూపాయలుగా ప్రకటించి దాన్ని 2300 రూపాయలకు పెచింది. పంట ఖర్చు, కౌలు ఖర్చు, కుటుంబ శ్రమ, అప్పుల వడ్డీలతో వాస్తవ వ్యయం రూ. 64 వేలు. క్వింటాల్ ఉత్పత్తి ఖర్చు రూ. 3200. దానిపై 50% కలిపితే 4,800 రూపాయలుగా మద్దతు ధర ప్రకటించాలి. దీన్ని గమనించినప్పుడు స్వామినాథన్ సిఫార్సులను మోడీ ప్రభుత్వం వక్రీకరించి విధానం తెలుస్తుంది. మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటానికి నిరాకరిస్తున్నది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, మద్దతు ధర 50% పెంచుతానని మోసపుచ్చుతూ వచ్చిన మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాల ద్వారా మద్దతు ధరలకే మంగళం పాడి పంటల సేకరణ నుంచి తప్పుకుంటే, ఆ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం ఉవ్వెత్తున సాగటంతో, చట్టాలను ఉపసంహరించుకోక తప్పలేదు. స్వతంత్ర పాలన ప్రారంభం నుండి నేటి వరకు పాలక ప్రభుత్వాలన్నీ రైతాంగ వ్యతిరేక విధానాలనే అనుసరించాయి. రైతాంగ ప్రయోజనాలను హరించి, బడా వ్యాపారుల ప్రయోజనాలకు అనుకూలంగా పంటల మద్దతు ప్రకటిస్తున్నాయి. గిట్టుబాటు గాని ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయారు. నాలుగు లక్షల మంది రైతులు అప్పులు తీర్చే మార్గం కనపడక బలవన్మరణాల పాలయ్యారు. రైతాంగం, రైతు, రైతు కూలీ సంఘాలు పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించి, ప్రభుత్వమే కొనుగోళ్లు చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేస్తున్నాయి. ఆ ఉద్యమాలను ఉధృతం చేసి మోడీ ప్రభుత్వం దిగి వచ్చేలా చేయాలి. అప్పుడే న్యాయమైన మద్దతు ధర లభిస్తుంది.

-ఎడిటర్

## బొడవుల శ్రీనివాస్ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం




పర్చూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన కారంచేడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొడవుల శ్రీనివాస్ (గన్) మృతి పట్ల తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు, స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి కుటుంబ సభ్యులకు తీరని లోటు అన్నారు. తెలుగుదేశం పార్టీ మంచి నాయకున్ని కోల్పోయిందన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా శ్రీనివాస్ ఉన్నారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పవిత్రాత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించారు. తెలుగుదేశం పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.

### కె ఆర్ కె ప్రసాద్ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

మండల పరిధిలోని నాగులపాలెం గ్రామానికి చెందిన కె ఆర్ కె ప్రసాద్ మృతి పట్ల తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు, స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటు అన్నారు. మంచి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రసాద్ కుమారులు ప్రవీణ్, మహేష్ సినీ నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారని, వారికి భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరారు.

## టిడిపి సీనియర్ నాయకులు గంగా బసవయ్య మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం



పర్చూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : నియోజకవర్గ పరిధిలోని మార్టూరు మండలం బొబ్బేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు గంగా బసవయ్య మృతి పట్ల తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు, స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి కుటుంబ సభ్యులకు తీరని లోటు అన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి బసవయ్య విశేష కృషి చేశారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ మంచి నాయకున్ని కోల్పోయిందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బసవయ్య పవిత్రాత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించారు.

### పలువురి సంతాపం

బొబ్బేపల్లి మాజీ సొసైటీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గంగా బసవయ్య మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. గంగా బసవయ్య 1982 సంవత్సరానికి ముందు కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలైన జనతా పార్టీ, లోక్‌దళ్ పార్టీలో పనిచేశారు. 1982 ఎన్టీ రామారావు పిలుపుమేరకు తెలుగుదేశం పార్టీలో చేరి అప్పటినుండి ఆ పార్టీలో సీనియర్ నాయకుడుగా కొనసాగుతూ పార్టీకి ఎనలేని సేవ చేశారని, ఆయన లేని లోటు తెలుగుదేశం పార్టీకి తీరనిదని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఏలూరి ప్రధాన అనుచరుడు అవిరినేని శ్రీకాంత్ , నాయకులు వెంకట్ గారు, తిలక్ గారు ,టీడీపీ సీనియర్ నాయకులు తొండెపు ఆదినారాయణ, బండి నాగేశ్వరరావు, క్యాంపు కార్యాలయం ఇన్చార్జి కామేపల్లి హరిబాబు, ముస్లిం నాయకులు షేక్ అబ్దుల్ రజాక్, షేక్ ఫరూక్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, యువ నాయకులు తేలప్రోలు శ్రీనివాసరావు,కామినేని జనార్ధన్, మిన్నకంటి రవిబాబు, శానంపూడి చిరంజీవి, సాంబశివరావు, కమ్మ శివ నాగేశ్వరరావు, పుట్టా అయ్యప్ప స్వామి, గంగా మనోహరరావు, జంపని శ్రీనివాసులు లు సంతాపం వ్యక్తం చేశారు.

### యద్దనపూడి మండలం నాయకుల సంతాపం

బొబ్బేపల్లి మాజీ సొసైటీ అధ్యక్షులు గంగా బసవయ్య మరణం పట్ల యద్దనపూడి మండలం తెలుగుదేశం నాయకులు నల్లపునేని రంగయ్య చౌదరి, రావి పాటి సీతయ్య, ధూళిపాల హరిబాబు, దూళిపాళ్ల సుబ్బారావు, మామిడిపల్లి పాపారావు, కొల్లా సాంబయ్య, ప్రత్తిపాటి శేషయ్య ఇంకా పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా ఉంది ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య




కంచికచర్ల (నందిగామ), ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొట్టమొదటి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అర్థం పట్టేలా ఉందని ప్రభుత్వం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఈ సందర్భంగా స్థానిక నందిగామ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లు ప్రజల ఆకాంక్షలను బడ్జెట్లో రూపొందించారని ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత విద్యుత్ అందించాలనేదే ఎంతో గొప్ప విప్లమాత్మక నిర్ణయం అని తెలిపారు అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయాన్ని హర్షణీయమని, అభివృద్ధి, సంక్షేపంతో పాటు హామీల అమలకు బడ్జెట్లో అధిక ప్రాధాన్య ఇవ్వటం జరిగిందని తెలిపారు. రైతే ముందు అనే నినాదాన్ని బడ్జెట్ కేటాయింపుల ద్వారా చూపించారని తెలిపారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కుందేలు చేస్తే, వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి పోస్తు బడ్జెట్లో కేటాయింపులు చేశారని అన్నదాత సుఖీభవ తల్లికి వందనం పథకాలకు బడ్జెట్ కేటాయింపులు చేయటం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చేలా జలవనరుల శాఖకు అధిక కేటాయింపులు ఇవ్వటం జరిగిందని మొత్తం బడ్జెట్లో దాదాపు 6% ఆరోగ్యానికి వైద్య విద్యకు కేటాయించటం జరిగిందని తెలిపారు బీసీల సంక్షేమానికి సబ్ ప్లాన్ ద్వారా బడ్జెట్ లో పెద్ద పీట వేయడం జరిగిందని అదేవిధంగా ఎస్ సి, ఎస్ టి మైనారిటీ వర్గాల అభివృద్ధికి బాటలు వేయడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కూటమి ప్రభుత్వం కేటాయింపులు చేయటం జరిగిందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు.

## ప్రమాదవశాత్తు కాల్ జారీ బాయిలో పడిన వ్యక్తి మృతి

### వెలికి తీసిన అగ్నిమాపక సిబ్బంది




కంచికచర్ల, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : కంచికచర్ల మండలం కీసర గ్రామంలో తలమాల సుధీర్ కుమార్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందాడు, విషయం తెలుసుకున్న పోలీసులు అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, అగ్ని మాపక సిబ్బంది బావిలోకి దిగి అతని వెతకగా అప్పటికే అతను మరణించినట్లు వారు గుర్తించారు. అతన్ని అగ్ని మాపక సిబ్బంది బావిలో నుంచి బయిటకు తీసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అభివృద్ధి పథంలో గన్నవరం గ్రామం




పచ్చూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చొరవ తో , మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నల్లపునేని రంగయ్య చౌదరి ఆధ్వర్యంలో పర్చూరు నియోజకవర్గ పరిధిలోని యద్దనపూడి మండలం గన్నవరం గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తున్నది. గ్రామము లో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రెండు బజార్లు మినహా గ్రామంలోని బజార్లు తో పాటు వీధి వీధి సందులు కూడా సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. అయితే రెండు రోడ్లు బజార్లు ఒకటి = దక్షిణం బజారు అయిన సోమేపల్లి స్వాములు ఇంటి వద్ద నుండి ప్రత్తిపాటి సాంబయ్య ఇంటి వద్ద వరకు, రెండు = గ్రామానికి తూర్పు వైపున సోమేపల్లి నరసింహారావు ఇంటి ముందు నుండి చెరుకూరి నరసింహారావు ఇంటి మూల వరకు ఈ రెండు ప్రతిపాదనలు మాత్రం టెక్నికల్ ఇబ్బందుల వల్ల అప్పట్లో పెండింగ్ పడ్డాయి. ఇప్పుడు కొత్త ప్రతిపాదనలతో పైన తెలిపిన రెండు రోడ్లతో పాటు చెరువు కట్ట మర్రిచెట్టు వద్ద నుండి మంచినీటి ట్యాంకులు, నీళ్ల బావులు వరకు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కొత్తగా ప్రతిపాదనలు చేసి మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ సహకారంతో ఎమ్మెల్యే ఏలూరి తోడ్పాటు తో తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లపునేని రంగయ్య చౌదరి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించి నిర్దేశిత కాలంలో వాటిని పూర్తి చేయడం జరిగింది. గత తెలుగుదేశం పార్టీ పాలనలో లక్షలాది రూపాయలు నిధులతో కొన్ని రోడ్లు సిమెంటు రోడ్లుగా పూర్తి చేయగా మరో 18 లక్షల రూపాయల నిధులతో రెండో విడత సిమెంట్ రోడ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు వెంటనే పూర్తి చేశారు. అవి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సందర్భంగా రంగయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నారని, దానికి తోడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నారని, పర్చూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్ నియోజకవర్గం గా తీర్చిదిద్దేందుకు , తొమ్మిది నెలల్లో నిధులు తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధి శ్రీకారం చుట్టారని అన్నారు. మా గ్రామంలో సిమెంటు రోడ్ల తో పాటు పొలాల లింకు రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలతో పాటు, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ గన్నవరం కార్యక్రమాన్ని, గ్రామంలో సైడ్ కాలువల మరమ్మత్తులు తో పాటు, పూడు తీయించే కార్యక్రమం శుభ్రత పరిశుభ్రత చేపట్టి,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయిన చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో రుణ సౌకర్యం పొందేందుకు లబ్ధిదారులు ఎంపిక చేసి మంజూరు నిమిత్తం పంపడం జరిగిందని, అలాగే ఇంకా అనేక పథకాలకు ప్రతిపాదనలు పంపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తోడ్పాటుతో గ్రామంలో జడ్పిటిసి చుండి నారాయణమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్ కుమార్ తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు ధూళిపాళ్ల కుమారస్వామి, నర్రా దేవసహాయరావు,సోమేపల్లి బాబు, సోమేపల్లి నరసింహారావు,ప్రత్తిపాటి రాజేష్, చెరుకూరి సురేంద్ర, ధూళిపాళ్ల సుబ్బారావు, మామిళ్ల పల్లి పాపారావు, చెరుకూరి శ్రీహరి రావు, ప్రత్తిపాటి వేణు, ప్రత్తిపాటి రామకృష్ణ, నర్రా శ్రీనివాసరావు, నర్రా వెంకన్న,నర్రా సత్యనారాయణ,దేవగిరి అబ్బిరెడ్డి,అరె రాఘవరెడ్డి, చెన్నుపాటి పాపారావు, చుండి సాంబయ్య, నల్ల పనేని వీరాంజనేయులు, చెరుకూరి సుబ్బారావు,కాసా రామకృష్ణ, గుంటుపల్లి రాంబాబు, సోమేపల్లి రవీంద్రబాబు, చెరుకూరు పున్నారావు, ముస్లిం నాయకులు పఠాన్ ఖాసిం వలి, రఫీ, పఠాన్ ఖాజావలి,అన్వర్ భాష, ఎస్సీ నాయకులు వేల్పుల వీరాస్వామి, కాకాని ఏసోబు, సురేషు, ఎస్టి నాయకులు నాగేశ్వరరావు, కార్యకర్తల సహకారంతో గన్నవరం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని రంగయ్య చౌదరి తెలిపారు.

## జగన్ రెడ్డి దోపిడీతో డిస్కంలపై రూ. 50 వేల కోట్ల అప్పు

- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కోలుకుంటున్న డిస్కంలు
- పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల సమర్థ వినియోగంతో డిస్కంలపై భారం తగ్గుతోంది

### విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



అద్దంకి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : ఆంధ్రప్రదేశ్ లో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడం ద్వారా డిస్కంలపై అప్పుల భారాన్ని తగ్గిస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ విషయమై అద్దంకి గొట్టిపాటి క్యాంపు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. డిస్కంలను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఇంధన శాఖ మహారాష్ట్ర లోని ముంబై వేదికగా నిర్వహించి కీలక సమావేశంలో శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వర్చువల్ గా పాల్గొన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ ఎస్సో నాయక్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ లతో పాటు మరో నాలుగు రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులు ఈ సమావేశానికి హాజరై.. ఆయా రాష్ట్రాల్లో డిస్కంల ఆర్థిక పరిస్థితులపై చర్చించారు. బకాయిల కారణంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన డిస్కంలను ఏ విధంగా లాభాల బాట పట్టించి ముందుకెళ్లాలనే అంశాలపై మంత్రులు సమాలోచనలు జరిపారు. అదనపు నష్టాలు, ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిస్కంల నుంచి రావాల్సిన, ఇతర మొండి బకాయిల వసూళ్ల పై కూడా ముఖ్యంగా దృష్టి సారించాలని మంత్రులు తీర్మానించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో డిస్కంలు ఆర్థికంగా బలపడుతున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలైన పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ లాంటి పథకాలను ఏపీ సమర్థవంతంగా వినియోగించుకొంటుందని స్పష్టం చేశారు. ఈ కారణంగా రాష్ట్రంలో డిస్కంలపై భారం తగ్గుతుందని మంత్రి గొట్టిపాటి కేంద్రానికి వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీంతో విద్యుత్ కొనుగోళ్లు గతంలో పోల్చితే గణనీయంగా తగ్గినట్లు చెప్పారు. అంతేగాకుండా గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించి రైతులకు, విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తామని తెలిపారు. అలాగే బ్యాటరీ స్టోరేజ్ కెపాసిటీని గతంలో అడిగినట్లుగా వెయ్యి నుంచి రెండు వేల మెగావాట్లకు పెంచాలని కోరారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ కు కేంద్రం ఇస్తున్న గ్రాంట్ ను పెంచాలని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం లక్ష పంపు సెట్లను మంజూరు చేసిన విషయాన్ని కేంద్ర సహాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన మంత్రి గొట్టిపాటి... వీటి సంఖ్యను నాలుగన్నర లక్షలకు పెంచాలని కోరారు. కొత్తగా ఏర్పడి, జగన్ రెడ్డి చేతిలో దోపిడికి గురైన ఈ రాష్ట్రానికి కచ్చితంగా కేంద్ర మద్దతు అవసరమని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో దోపిడి తప్ప విద్యుత్ వ్యవస్థపై కానీ సంస్కరణలపై కానీ జగన్ అండ్ కో దృష్టి పెట్టలేదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కేంద్రానికి తెలిపారు. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ. 17 వేల కోట్లు అప్పు ఉంటే.. గడిచిన ఐదేళ్లలో డిస్కంల అప్పు మరో రూ. 50 వేల కోట్లు పెరిగి మొత్తంగా రూ. 67వేల కోట్లకు చేరినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. దీంతో డిస్కంలు ఆర్థికంగా సర్వ నాశనం అయినట్లు కేంద్రానికి వివరించారు. జగన్ ప్రభుత్వంలో డిస్కంలకు రావాల్సిన సబ్సిడీలను సకాలంలో చెల్లించలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిస్కంలు రూ. 11,352 కోట్లు చెల్లించి పునర్జీవం పోసినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఒక్క అవకాశాన్ని కూడా వినియోగించుకోలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

### ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని అభ్యర్థించిన ప్రత్తిపాటి పుల్లారావు

### బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా ఉన్నాయని బాబు కి ధన్యవాదాలు తెలిపిన ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : అసెంబ్లీ సమావేశాల సంధర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ని కలిసి,చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని మాజీ మంత్రి వర్యులు, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కోరడం జరిగింది. కొండవీడు కోటను పర్యటక రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు ఉన్న అవకాశాలను బాబు కి ప్రత్తిపాటి పుల్లారావు వివరించడం జరిగింది. జాతీయ రహదారి నుండి టన్నెల్ మార్గం ద్వారా కొండవీడు ఘాట్ రోడ్డును అనుసంధానం చేయడం ద్వారా టూరిజం పెద్ద ఎత్తున పెరిగే అవకాశం ఉన్నదని, రాజధాని అమరావతికి అత్యంత సమీపంలో ఉన్న చారిత్రక పర్యటక ప్రాంతం కొండవీడు అని బాబు కి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అలాగే పట్టణంలో ఉన్న టిడ్కో గృహ సముదాయానికి మౌలిక వసతులు కల్పించడానికి నిధులు కేటాయించాలని, పట్టణ వాసులకు నిరంతరం తాగు నీటిని అందించే ప్రతిష్ఠాత్మక అమృత్ పథకానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని కోరారు. ప్రత్తిపాటి పుల్లారావు కోరిన పలు అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించడం జరిగింది. అలాగే నిన్న జరిగిన శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలలో బాగా కష్టపడి పని చేశారని ప్రత్తిపాటి పుల్లారావును ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందించడం జరిగింది. అలాగే నేటి బడ్జెట్ కేటాయింపులు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదం చేసేలా ఉన్నాయని,రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా కేటాయింపులు ఉన్నాయని ముఖ్యమంత్రినారాచంద్రబాబునాయుడు కి ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు ధన్యవాదాలు తెలియజేశారు.

## పేదలను ఆదుకునేందుకు అంజుమన్ కమిటీ ముందుండాలి



పొన్నూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం అంజుమన్ కమిటీ నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన న్యాయవాది మక్బుల్ బేగ్ ను గురువారం అంజుమన్ కమిటీ కార్యాలయంలో నాజర్ యూత్ అధ్యక్షుడు, వైఎస్ఆర్సిపి పొన్నూరు నియోజకవర్గ ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ నాజర్ పార్టీ శ్రేణులతో కలిసి దుశ్శాలువా పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అంజుమాన్ కమిటీ ద్వారా పేదలకు సహాయం అందలించడంతోపాటు కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని నాజర్ సూచించారు.

## ప్రతి విద్యార్థి సైన్స్ లో ప్రతిభకనబరచాలిఎంఈఓ



పొన్నూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : గుంటూరు జిల్లా,పొన్నూరు పట్టణంలో శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ డే దినోత్సవం జరిగింది. పొన్నూరు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొని విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ పరికరాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి విజ్ఞానాభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఏజీఎం డా. నూతలపాటి అంజయ్య, రీజనల్ ఇన్చార్జి అప్పాజీ విద్యార్థులను అభినందించారు. పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రోడ్లు వేశారు కల్వర్టులు మరిచారు



కంచికచర్ల, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : కంచికచర్ల డివిఆర్ మోడల్ కాలనీలో సిసి రోడ్లను వేశారు కానీ మెయిన్ రోడ్డుకు వక్క రోడ్లకు అనుసంధానంగా ఉన్న కాలువలపై కల్వర్టుల నిర్మాణాల్ని మరిచారు. కల్వర్టుల నిర్మాణానికి తీసిన గోతులు నెలలు కావస్తున్న పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లకు తీరిక దొరకడం లేదు. దీంతో ప్రజలు కల్వర్టుల నిర్మాణ ప్రాంతంలో నడవడానికి వీలు లేకుండా పోయింది. అంతేకాకుండా తీసిన గుంతలలో నీరు నిలబడి దోమల బెడద, మురుగు వాసనతో ప్రజలు అల్లాడుతున్నారు. కాలువల నిర్మాణానికి రెండు పక్కల గోడలైతే నిర్మించారు కానీ దాన్ని పూర్తి చేయడానికి నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు శ్రద్ధ చూపడం లేదని.ఆదికారులు ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం అయితే నిధులు మంజూరు చేస్తుంది కానీ వాటి నిర్మాణానికి సరైన పర్యవేక్షణ లేక పనులు అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. ఇలాంటి జాప్యం వలన ప్రజలకు ప్రభుత్వంపై అసంతృప్తిని కలిగించేలా ఉన్నాయి. దీంతో సొమ్ము పోయి శని పట్టిన చందంగా మారింది. అధికారులకు కాంట్రాక్టర్లకు మధ్య ఏమి లాలూచీ జరిగిందో కానీ ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటి వాటిని పట్టించుకునే నాధుడే లేడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల అవసరాలను గుర్తించి వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించ వలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

## మేధో వికాసం తో విద్యా వికాసం



కంచికచర్ల (వీరులపాడు), ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : చిన్నారుల మానసిక వికాసం సరైన దిశలో ఉన్నప్పుడు వారిలో విద్య ఉన్నతంగా వృద్ధి చెందుతుందని ఏకత్వ పాఠశాల డైరెక్టర్ డా.అమరనేని మనోజ్ అన్నారు. "జాతీయ సైన్స్ దినోత్సవాన్ని" పురస్కరించుకొని పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అకాడమిక్ ఫెయిర్ అందరినీ ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో 5వ తరగతి జుపిటర్ చదువుతున్న బుద్ధి నిహస్వి తోటి విద్యార్థులు ఎర్త్ క్విక్ అలారం తయారు చేసి దాని గురించి వివరించడం జరిగింది. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్, కంప్యూటర్, గణిత ప్రాజెక్టులు విద్యార్థుల ప్రతిభకు, ఉపాధ్యాయుల బోధనా శైలికి పట్టం కట్టాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి పాల్ కెనడీ మాట్లాడుతూ...విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించి, వాటి పని తీరు, ఉపయోగాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అడపా నాగ సూర్యావతి, డైరెక్టర్ అమరనేని సింధూర, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డి.ఇ.ఓ ఎల్. చంద్రకళ

### ప్రాథమిక పాఠశాల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ జరగడం సంతోషదాయకం.: డీఈవో

### ఎన్.ఉమామహేశ్వరి ని దుశ్శాలువ తో సత్కరించిన డి.ఇ.ఓ



ఎడ్లపాడు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : ఎడ్లపాడు మండలం లోని వైదవోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ శాస్త్రవేత్త సివి రామన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన సైన్స్ దినోత్సవాన్ని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్. చంద్రకళ రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ముందుగా సి.వి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి ఆవిష్కరించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులంతా సైన్స్ కి సంబంధించిన ప్రయోగాలు, గణితానికి సంబంధించిన చతుర్విధ ప్రక్రియలను 'లెర్నింగ్ బై డూయింగ్' అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని వర్కింగ్ మోడల్స్ తయారు చేశారు.భాగహార యంత్రం, భాషాభాగాలకు సంబంధించిన నమూనాలు (మోడల్స్) , ఒత్తుల బుట్ట, స్థాన విలువలు, కమ్యూనికేషన్ ప్రిపోజిషన్, వాట్సాప్ స్పీచ్,పద్యాల బుట్ట, నీటిని శుభ్రపరచు విధానము, తిథులు, ఇల్లు-రకాలు.. ఇలా ఇంకా కోకరిక్యులర్ విభాగంలో కాఫీ పెయింటింగ్, లో కాస్ట్ తో తయారు చేసిన బ్యాగులు, బుట్టలు, ఫోటో ఫ్రేములు, గ్లాస్ పెయింటింగ్స్ లాంటి కళాఖండాలు కూడా ప్రదర్శించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలస్థాయిలో ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్ జరగడం చాలా సంతోషదాయకం అన్నారు. చిన్న చిన్న పిల్లలు చాలా చక్కగా అన్ని ప్రయోగాలను వివరించారని, విద్యార్థులను ఇంతటి ప్రయోజకులుగా తీర్చిదిద్దన పాఠశాల ఉపాధ్యాయుల టీం స్పిరిట్ ని / సమిష్టి ప్రతిభని అభినందించారు. ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు కూడా ఇలా విద్యార్థులను ప్రోత్సహించేలాగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని, ఇటువంటి పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని చెప్తూ పాఠశాలలో అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల కోసం ఎప్పుడూ వినూత్నరీతులలో పాఠాన్ని బోధించే ఉపాధ్యాయురాలు ఎన్. ఉమామహేశ్వరి ని దుశ్శాలువ తో సన్మానించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారిణి ఎం.వి. నాగరత్నం మాట్లాడుతూ ఈ పాఠశాలలోని ఉపాధ్యాయులు నలుగురూ కూడా చాలా చక్కగా పనిచేస్తారని,మండలంలో ఈ పాఠశాల అన్ని విషయాల్లోనూ ముందుంటుందని, విద్యార్థుల కోసం చాలా టి.ఎల్.ఎం ని తయారు చేసి పెట్టుకున్నారని కొనియాడారు.ఐటిసి సంస్థ నుండీ ఎమ్. ఎస్. కే. సురేష్ పాల్గొని విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సొలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ.వి. శ్రీనివాసరావు, ఎడ్లపాడు జడ్పిహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు విజయభారతి, బోయపాలెం డైట్ నుంచి యోగేశ్వర్ ఇంకా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవి హేమలత, జి సతీష్ కుమార్, ఎన్ ఉమామహేశ్వరి, షేక్ షహనాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ప్రత్తిపాటి ఆదేశాలతో మంచినీటి చెరువులను సందర్శించిన : మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

### పట్టణ ప్రజలకు వేసవి కాలం నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి:మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలకు అవసరాలకు అనుగుణంగా మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం నాడు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పార్టీ నాయకులతో కలిసి రెండు మంచినీటి చెరువులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక చొరవతో సాగర్ నుండి విడుదలైన జలాలను, రెండు చెరువులకు నీరు నింపటం జరిగిందని అన్నారు.అయితే వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు భూమిలో ఇంకిపోవడం అయ్యే అవకాశాలు ఉన్నాయి. కావున పెరిగిన నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత ఎక్కువగా మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని పట్టణ ప్రజలను కోరారు.అదే విధంగా గృహ అవసరాలకు మంచినీటి సరఫరా లో ఎటువంటి మార్పులు లేకుండా పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలకు నీటిని కుళాయిల ద్వారా పంపిణీ చేయాలని శాసన సభ్యులు వారు ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలని అధికారులను కోరారు,అదే విధంగా వ్యాపార వర్గాల వారు కూడా వేసవి కాలంలో తాగునీటిని తాగు నీటి అవసరాల కోసం వాడుకోవాలని మరే ఇతరత్రా కార్యక్రమాలకు వాడుకోకుండ సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ అధికారులు మంచినీటి సరఫరా లో అంతరాయం కలగకుండా ఏమైనా లీకులు ఏర్పడిన మరమ్మతులు చేయవలసి ఉన్న ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.శివారు ప్రాంతాల్లో ప్రజలకు మంచినీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి టీ.డి.పి. కరిముల్లా. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, తదితరులు ఉన్నారు.

## సుజనా ఫౌండేషన్ సేవలు అభినందనీయం : నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి




కంచికచర్ల (నందిగామ), ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : సుజనా ఫౌండేషన్ మహిళా సాధికారత కేంద్రం, నందిగామ నందు వివిధ కోర్సులలో శిక్షణ పొందుతూ మహిళలు వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకుంటున్నారని సృజన ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి అన్నారు. డాన్ బోస్కో కాంప్లెక్స్ చైతన్య కాలేజీ ఎదురుగా ఉన్న సుజన ఫౌండేషన్ కేంద్రాన్ని స్థానిక నేతలతో కలిసి సందర్శించారు. ఈ క్రమంలో మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రస్తుత పరిస్థితుల్లో వారి విద్యా నైపుణ్యాలను బట్టి తమ సంపాదన తమ సంపాదించుకుంటూ ఆనందంగా జీవించుటకు టైలరింగ్ మరియు ఎంబ్రాయిడరీ మరియు గార్మెంట్స్ రంగంలో కేవలం స్వల్ప వ్యవధిలో శిక్షణ పొందే అవకాశం ఇది సుజనా ఫౌండేషన్ వారు కల్పించారన్నారు. కోర్సులలో అడ్వాన్స్ టెక్నాలజీ పై శిక్షణ వయోపరిమితికి సంబంధం లేకుండా టైలరింగ్ నందు అనుభవం కలిగిన ఇన్స్ట్రక్టర్ చే శిక్షణ ఇవ్వబడుతుందని 20% థియరీ మరియు 80% ప్రాక్టికల్ ఉంటాయని తెలిపారు. శిక్షణ కల్పించడం శిక్షణ కాలం పూర్తి అయిన తర్వాత సంస్థ వారు సర్టిఫికెట్ ఇస్తున్నారని ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య నేతృత్వంలో మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సృజన ఫౌండేషన్ సీఈవో వీరమాచినేని కిరణ్, కోఆర్డినేటర్ కొంగర దుర్గాప్రసాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఉదయ్ కిరణ్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ అమలుకు కేటాయింపులేవి?

### ఎస్.టి.యు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వేముల. భిక్షమయ్య



కంచికచర్ల, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : 2023 జూలై నుండి అమలు చేయవలసిన 12వ పీఆర్సీ ఇప్పటికే 20 నెలలు ఆలస్యమైనప్పటికీ, ఈరోజు ప్రవేశపెట్టిన బడ్జెట్లో పీఆర్సీ, ఐ.ఆర్ అమలు కొరకు నిధుల కేటాయింపులపై స్పష్టత ఇవ్వలేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆం.ప్ర(ఎస్.టి.యు) ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వేముల.భిక్షమయ్య తెలిపారు. సిపిఎస్/ జిపిఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై బడ్జెట్లో ఎటువంటి ప్రకటన లేదన్నారు. అలాగే పాఠశాల విద్యకు గత సంవత్సరం 10.15% నిధులు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్లో 9.86% మాత్రమే నిధులు కేటాయించారన్నారు. ఆర్థిక శాఖమంత్రిగారు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ' జీవిత కాలానికి ప్రణాళిక వేస్తే ప్రజలకు విద్య నేర్పండి' అని చైనీయుల సామెతను ఉదంకించారని, విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్ గా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ దానికి తగినన్ని నిధులు బడ్జెట్లో కేటాయించ లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తామని చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల కే వర్తింపజేయాలి

## స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు బలమైన పునాదిగా రాష్ట్ర బడ్జెట్: చీఫ్ విప్ జీవీ



వినుకొండ, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు బలమైన పునాదిగా రాష్ట్ర బడ్జెట్ నిలిచిందన్నారు ప్రభుత్వ ఛీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం. దానికి పరిష్కారాలు చూపగల ముఖ్యమంత్రి చంద్ర బాబు సామర్థ్యాలకు ఇది నిదర్శనంగా నిలిచిందన్నారు. అయిదేళ్ల వైకాపా పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూ. 3,22, 359కోట్లతో రూపొందించిన బడ్జెట్లో అన్నిరంగాలు, అన్నివర్గాల వారికి అండగా నిలిచే ప్రయత్నం చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఒకవైపు అప్పులు, వడ్డీలకే రూ. 60వేలకోట్లు కట్టాల్సి వస్తున్న తరుణంలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం రూ.75వేల కోట్ల వరకు కేటాయి ంపులు చేయడం ఆయావర్గాల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి ఉదాహరణగా పేర్కొ న్నారాయన. అన్నమాట ప్రకారం తల్లికి వందనం అమలుకు రూ. 9వేల 407 కోట్లు, అన్నదాత సుఖీ భవకు రూ. 6వేల 30కోట్లు ఇవ్వడాన్ని సూపర్‌సిక్స్ పథకాల అమల్లో తిరుగులేని ముంద డుగుగా పేర్కొన్నారు. ఎన్టీఆర్ పెన్షన్లకు రూ. 27వేల 518కోట్లు కేటాయించడ ద్వారా వృద్ధులు, దివ్యాంగులు సహా లబ్ధిదారులందరికీ భరోగా నిలిచారన్నారు. పోలవరానికి రూ. 6వేల 705కోట్లు, అమరావతికి రూ.6వేల కోట్లు కేటాయించడం ద్వారా వాటి పూర్తిపై విశ్వాసం కలిగించారన్నారు. విద్యారంగానికి దాదాపు రూ.40వేల కోట్ల కేటాయింపులతో రాష్ట్ర భవితకు పెద్దపీట వేయడం ఎంతో సంతోషకరమైన విషయంగా పేర్కొన్నారు. వీటన్నింటి ద్వారా బ్రాండ్ ఏపీపై తిరిగి నమ్మకం కలిగించడం, పెట్టుబడులు, పరిశ్రమలను ఆహ్వానించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 73 వరకు కేంద్ర ప్రాయోజిత పథకాలను తిరిగి ఉపయోగించుకోవాలని నిర్ణయించడం మంచి పరిణామం. తద్వారా కేంద్రం నుంచి భారీగా నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. వ్యవసాయం నుంచి ప్రజల వైద్యారోగ్యం వరకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ లో వరికపుడిశల ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం విచారకరం: మారుతీ వరప్రసాద్ సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి



వినుకొండ, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : శుక్రవారం నాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో పల్నాటి ప్రాంత ప్రజల దశాబ్దాల కల లక్షల ఎకరాల సాగు భూమి కి నీరు త్రాగునీరు లభించే ప్రధానమైన ప్రాజెక్ట్ అయిన వరికపూడి శల ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమైన విషయమని కనీసం ఆ ప్రాజెక్టును త్వరలో ప్రత్యేక కేటాయింపులతో నిర్మిస్తాము అనే పదాలు కాని లేకపోవడం విచారకరమని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ దశ దిశ లేనిదని వ్యవసాయానికి బడ్జెట్లో కేటాయించిన నిధులు లక్షలాదిగా ఎదురుచూస్తున్న రైతులకు మేలు చేసే విధంగా లేదని, ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించి సూపర్ సిక్స్ పథకాలకు నిధుల కేటాయింపు లేకుండా ఉన్నదని, గిట్టుబాటు ధర లేక రైతాంగం అల్లాడుతుంటే ధరల స్థిరీకరణకు కేవలం 300 కోట్లు కేటాయించడం దారుణం అన్నారు. రాష్ట్రంలో సుమారు 85 లక్షల మంది విద్యార్థులకు కేటాయింపులు కాని వైద్యానికి పట్టణాలు గ్రామీణ ప్రాంతాలలో హాస్పిటల్స్ నిర్మాణానికి నిధుల కేటాయింపు సరిపోయే రీతిలో లేవని ఆయన అన్నారు. 50 లక్షల మంది గా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి పథకం ఊసు లేదని జాబ్ క్యాలెండర్ ప్రస్తావన రాలేదని రాజధాని కేటాయింపులు అరకొరగా ఉన్నాయని శుక్రవారం ప్రకటించిన బడ్జెట్ పై ఆయన ఈ విధంగా పత్రికలకు ఇచ్చిన ప్రకటనలో అన్నారు.

## ఏ.ఎం.జీ పాఠశాలలో ఘనంగా నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవం



చిలకలూరిపేట, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిలకలూరిపేట పట్టణంలోని ఏ.ఎం.జీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి పర్యవేక్షణలో ఏ.ఎం.జీ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థుల చేత సైన్స్ కు సంబంధించి వివిధ రకాల ప్రయోగాలు, ప్రాజెక్టులు, నమూనాల ఆకృతులు ఏర్పాటు



చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎంజీ విద్యాసంస్థల ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ రబ్బి పుతిరన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. అనంతరం జాతీయ సైన్స్ డే కార్యక్రమంలో భాగంగా 64 రకాల సైన్స్ ప్రదర్శనలలో విద్యార్థులు ప్రదర్శించారు.మంచి ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.ఈ ప్రదర్శనలను డి.ఐ.టి.ఐ కాలేజీ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు,ఏ.ఎం.జి డిగ్రీ కాలేజీ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు,నర్సింగ్ స్కూల్ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు తగు సూచనలు సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె కృపాదానం మరియు సైన్సు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులు ధర్నా



వినుకొండ, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : వినుకొండ మున్సిపాల్టీలో ఇంజనీరింగ్ కార్మికులు ఎదురుకొంటున్నటువంటి సమస్యలు పరిష్కరించాలి అని మున్సిపల్ ఆఫీస్ ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నాకు మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రేవిళ్ళ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బుదాల.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత మూడు నెలల క్రితం మున్సిపాల్టీకి డి ఈ గా వచ్చినటువంటి విష్ణు మూర్తి విధులకు వచ్చిన రెండు నెలల నుండి ఇంజనీరింగ్ కార్మికులను మానసికంగా వేధిస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నాడు అదేమని ప్రశ్నిస్తే ఇతను నన్ను అడిగే అంతటి వాడా అని వ్యక్తిగత కక్షతో జీతాలు ఇవ్వకుండా కార్మికులను వేధిస్తున్నాడు మేము ఏ తప్పు చేయలేదు కదా మా డ్యూటి మేము సక్రమంగా నే చేసుకుంటున్నాముగా అని అడిగిన ప్రతి కార్మికుడిని మిమ్మల్ని విధుల నుండి తొలిగిస్తాను అని బెదిరిస్తూ భయబ్రాంతులకు గురిచేస్తూ మానసికంగా వేధిస్తున్నాడు డి ఈ వేధింపులు ఆపకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాము అని ఏఐటీయూసీ నాయకులు బుదాల శ్రీనివాసరావు హెచ్చరించారు ధర్నా జరుగుతున్న సంగతి తెలుసుకొని ధర్నా దగ్గరకు వచ్చిన కమీషనర్ సుభాష్ చంద్రబోస్ కార్మికులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరిస్తాను అని అలాగే పెండింగ్ లో ఉన్నటువంటి జీతాలు వీరికి కూడా చెల్లిస్తాము అని కమీషనర్ %డ% చైర్ పర్సన్ సతీమణి షకీలా కూడా హామీ ఇవ్వడం తో నిరసన కార్యక్రమం విరమింప చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగూర్ వలి, స్వామి,మురుగుల నాగరాజు, చిన్న గాలెయ్య,లక్ష్మణ్,జ్యోతి, మల్లీశ్వరి,సంపెంగుల అబ్రహం రాజు,పచ్చిగొర్ల ఏసు, సాయిబాబు,రాచపూడి ఏసు పాదం,తదితరులు పాల్గొన్నారు.

## బ్యాలెట్ బాక్స్ లకు పటిష్టమైన భద్రత కల్పించాలి - జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు

### ఎస్ ఎస్ ఎన్ కళాశాలలో బ్యాలెట్ బాక్స్ ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్




పల్నాడు జిల్లా, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్ లకు పటిష్టమైన భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్ ఎస్ ఎన్ కళాశాలలో బ్యాలెట్ బాక్స్ లను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి జిల్లాలో పోలింగ్ ప్రక్రియ పూర్తి అయిందని,బ్యాలెట్ బాక్స్ లకు పటిష్టమైన భద్రత కల్పించాలన్నారు.బ్యాలెట్ బాక్స్ ల స్వీకరణ కేంద్రంలోని సిబ్బంది బ్యాలెట్ బాక్స్ ల స్వీకరణ సమయంలో బాక్స్ లకు ఉన్న సీళ్లను నిశితంగా పరిశీలించాలని అనంతరం స్ట్రాంగ్ రూమ్ సిబ్బంది వాటిని నిర్దేశించిన ప్రదేశంలో చేర్చాలన్నారు. బ్యాలెట్ బాక్సులు అందించేందుకు పోలింగ్ స్టేషన్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, కౌంటర్లలో సిబ్బంది వారికి కేటాయించిన బ్యాలెట్ బాక్సులను మాత్రమే తీసుకోవాలన్నారు. ఇందుకోసం హెల్ప్ డెస్క్ లను కూడా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. బ్యాలెట్ బాక్సుల స్వీకరణ కేంద్రంలో సిబ్బందికి అవసరమైన త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని, ఆహారం, అల్పాహారాలను ఎప్పటికప్పుడు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ ప్రభుత్వహామీలను విస్మరించే బడ్జెట్



రేపల్లె, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : భవిష్యత్తులో ప్రజలపై భారాలు,అప్పులు వేసే ప్రమాదకరమైన బడ్జెట్ ను రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిందని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ విమర్శించారు. శుక్రవారం సిపిఎం పార్టీ కార్యాలయంలో సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ 3.22లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్, రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి తోడ్పడేదిగా లేదు అన్నారు. పైగా లక్షల కోట్లు అదనంగా అప్పు చేసే బడ్జెట్ లా ఉంది,80వేల కోట్లు ద్రవ్యలోటు ఉంది. దాన్ని పూడ్చుకోడానికి ప్రజలపై అదనపు భారాలు వేసేదిగా ఉంది. పన్నులు ద్వారా ఆదాయం 14 వేల కోట్లు,పన్నేతర ఆదాయం 12 వేల కోట్లు పెంచి చూపడం ద్వారా ఇది ప్రజలపై భారాలు పెంచుతుంది లేదా అనుకున్న ఆదాయం రాలేదంటూ పథకాలకు కోతపెట్టే ప్రమాదముంది. ప్రభుత్వ హామీలు ఇచ్చిన పథకాలకు కేటాయింపులు చూపడంకోసం ఆచరణాత్మకం అయన ప్రతిపాదనలు లేవు,వ్యవసాయం,ఇరిగేషన్,సంక్షేమ కార్యక్రమాలకు గత బడ్జెట్ కన్నా పెరుగుదల కనిపించేలాగా ఉన్నది,కానీ టిడిపి కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న యువతకు నిరుద్యోగభృతి గురించి మాట మాత్రం ప్రస్తావించకపోవడం అన్యాయం,యువతను ఈ బడ్జెట్ నిరాశ మిగిల్చింది. ప్రతిపక్షంలో ఉండగా అనివర్గాలు ప్రజలకు న్యాయంచేస్తామని చెప్పి మొత్తం బడ్జెట్ లో విద్యరంగానికీ గతంలో 11.37% కేటాయిస్తే ఇప్పుడు తగ్గించి 10.8%కి, గతంలో వైద్యానికి 6.2% నుండి 5,98%కి తగ్గించారు. బడ్జెట్లో దాదాపు మూడో వంతు మొత్తం1.02 లక్షల కోట్లు అప్పుపైనే ఆధారపడిన స్థితి దీనితో ఏది ఎంత వరకు ఆచరణకొస్తుందో చెప్పలేని పరిస్థితి. ఈ బడ్జెట్ గత ప్రభుత్వంలో కన్నా ఎక్కువగా అప్పుల ఊబి,ప్రజలాపై భారాల మోత తప్పని పరిస్థితిలగా ఉంది అని విమర్శించారు...

## ప్రపంచ వైజ్ఞానిక రంగంలో భారత్ అగ్రగామిగా ఉండాలి

### డెమొక్రటిక్ పిఆర్టియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి. శ్రీను



పొన్నూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : ప్రపంచ వైజ్ఞానిక రంగంలో. భారత్ అగ్రగామిగా ఎదగాలని ఆ దిశలో మన విద్యార్థులను పరిశోధనాత్మక రంగంలోకి మరలించాలని డెమొక్రటిక్ పి ఆర్ టి యు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి శ్రీను అన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఛౌతరా సెంటర్ గుంటూరు నందు డెమొక్రటిక్ పిఆర్టియు ఆధ్వర్యంలో నిర్వహించబడిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి శ్రీను మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుండి సైన్స్ పట్ల. శాస్త్రవేత్తల పట్ల ప్రయోగాల పట్ల పరిశోధన పట్ల చక్కటి అభిరుచిని కల్పించి తద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి డెమొక్రాటిక్ పిఆర్టియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి ఎన్నో విద్యా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఖాసీం మాట్లాడుతూ విద్యార్థుల్ని ఉపాధ్యాయులను ప్రోత్సహించడానికి డెమొక్రటిక్ పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం మా పాఠశాల ఎన్నుకోవడం. అభినందనీయమన్నారు విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనశాలను ప్రారంభించారు. ఉత్తమ ప్రదర్శన అందించిన. విద్యార్థులకు మరియు సైన్సు ఉపాధ్యాయులకు డెమొక్రటిక్ పిఆర్టియు పక్షాన సర్ సివి రామన్ పురస్కారాలు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డెమొక్రటిక్ పి ఆర్ టి యు గుంటూరు జిల్లా నాయకులు జ్ఞానేశ్వర్కుమార్ రాజా. ఆనందరావు. ఎలమంద. తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లో ఘనంగా నేషనల్ సైన్స్ డే

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న డి ఈ ఈ అశోక్ కుమార్






చిలకలూరిపేట, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : చిలకలూరిపేట పట్టణం స్థానిక సుబ్బయ్య తోట నందు శ్రీచైతన్య టెక్నో స్కూల్ క్యాంపస్ నందు ఈ రోజు నేషనల్ సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఎక్స్పో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిలకలూరిపేట డి.ఈ.ఈ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డేగా జరుపుకోవాలని 1986లో అప్పటి ప్రభుత్వం తొలిసారిగా ప్రకటించింది. ఈ తేదీని జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకోవడానికి ప్రాథమిక లక్ష్యం దేశంలోని విద్యార్థులకు సైన్స్ రంగం పట్ల ఆసక్తి కలిగేలా చేయడం.. కొత్త ప్రయోగాల వైపు వాళ్లను ప్రేరేపించడం. అంతేకాదు వారిని సైన్స్ వైపు ఆకర్షించడం, వైజ్ఞానిక విజయాలపై అవగాహన కల్పించడం అన్నారు. అనంతరం విద్యార్థుల ప్రాజెక్ట్స్ స్మార్ట్ సిటీ, డ్యాం, డైజెస్టివ్ సిస్టం హైడ్రో ఎలక్ట్రిసిటీ, బయోగ్యాస్ ప్లాంట్, యానిమల్ హాబిటేషన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ చూసి వారి ప్రతిభను అభినందించారు. విద్యార్థులు ఈ రకమైన ప్రాక్టికల్ నాలెడ్జ్ తో ఎంతో పురోగతిని సాధిస్తారు అని పేర్కొన్నారు. విద్యార్థులను ఈ విధముగా ప్రోత్సహిస్తున్న శ్రీచైతన్య మేనేజ్మెంట్ నీ టీచర్లు నీ పేరెంట్స్ నీ అభినందించారు. అనంతరం పలువురు విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ కోటేశ్వరరావు,పోతురాజు, స్కూల్ మేనేజ్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ కోసం యువత శాస్త్రీయ ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి



పొన్నూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : జాతీయ సైన్స్ దినోత్సవం - 2025 సందర్భంగా గుంటూరులోని పాత బస్టాండ్ సెంటర్లోని స్థానిక పరీక్షాభవన్ నందు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం సమగ్ర శిక్ష, ఆంధ్ర ప్రదేశ్ మరియు ఏ.పి.కాస్ట్, విజయవాడ వారి సౌజన్యంతో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించినట్లు గుంటూరు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం మరియు డ్రాయింగ్ పోటీలను సీనియర్ మరియు జూనియర్ విభాగాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గుంటూరు ఉప విద్యాశాఖాధికారి జి యేసు రత్నం మాట్లాడుతూ భారత శాస్త్రవేత్త సర్ సి.వి రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్' గౌరవార్థం ఫిబ్రవరి 28వ తేదీన భారతదేశం 'జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటుందని విద్యార్థులు సైన్స్ను చదవడానికి, ఆ రంగం పట్ల ఆసక్తిని పెంచుకోవడానికి శుక్రవారంరోజును జరుపుకుంటారని ఏటా ఒక్కో థీమ్తో జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుతుంటారు. 2025వ సంవత్సరంలో "వికసిత్ భారత్ కోసం సైన్స్ మరియు ఇన్నోవేషన్లో గ్లోబల్ లీడర్షిప్ కోసం భారతీయ యువతకు సాధికారత'థీమ్తో ఈ జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నారని అన్నారు. వికసిత్ భారత్ సాధించాలంటే యువత శాస్త్రీయ ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలతోనే వాస్తవాలు వెలుగులోనికి వస్తాయన్నారు. వాస్తవాలు వెలుగు చూడని అనేక అంశాలుఉన్నాయని,వాటిపై విద్యార్థులు పరిశోధనలు చేసేటట్లుప్రయత్నించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ పాఠశాలల డి.ఐ మొహమ్మద్ ఖాసిం మండల విద్యాశాఖాధికారి బి.వి.రమణయ్య ప్రధానోపాధ్యాయులు వసుంధర, రిసోర్స్ పర్సన్ లు అప్పారావు వెంకటేశ్వరరావు గంగాధర్ భాస్కరరావు ఏకాంబరేశ్వరరావు మరియు గైడ్ టీచర్లు పాల్గొన్నారు. విజేతల వివరాలు : వ్యాసరచన1. ప్రథమ బహుమతిఎమ్. భవిష్య ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీనియర్ కె. హారికనారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్2 ద్వితీయ బహుమతిషేక్ జిక్ర, కె.కె. మున్సిపల్ హై స్కూల్ మంగళగిరి సీనియర్ సిహెచ్. సందేశ్ ఎమ్.సి.యు.పి.పాఠశాల వినోభానగర్ గుంటూరు జూనియర్3. తృతీయ బహుమతి వసీం అరాఫత్ హిందూ కాలేజ్ హైస్కూల్ గుంటూరు సీనియర్ వంశి ఎమ్.పి.పి. స్కూల్, చామల్లముడి జూనియర్. వకృత్వం1. ప్రథమ బహుమతిఆర్ కీర్తి జలగం రామారావు ఉన్నత పాఠశాల, గుంటూరు సీనియర్ సిహెచ్. సందేశ్ ఎమ్.సి.యు.పి.పాఠశాల వినోభానగర్, గుంటూరు జూనియర్2. ద్వితీయ బహుమతిఎన్. జాహ్నవి ఏ.పి.ఆర్. మైనారిటీ బాలికల ఉన్నత పాఠశాల గుంటూరు సీనియర్. పి జాస్మిన్, కె.కె. మున్సిపల్ హై స్కూల్ మంగళగిరి జూనియర్ 3. తృతీయ బహుమతిషేక్ సమీరా బాయిపులిపాక హై స్కూల్గుంటూరుసీనియర్ ముబష్శిర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ అమీనాబాద్ జూనియర్ డ్రాయింగ్1. ప్రథమ బహుమతిషేక్ రేష్మ పర్వీన్ జలగం రామారావు ఉన్నత పాఠశాల, గుంటూరు సీనియర్ కె. హరి కార్తీక్ ఎమ్.పి.యు.పి.స్కూల్, ములుకుదురు జూనియర్2. ద్వితీయ బహుమతిబి. జాహ్నవి కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీనియర్ కె. ప్రణతినారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ 3. తృతీయ బహుమతిటి. శాంతి, శారదా నికేతన్ గవర్నమెంట్ ఉన్నత పాఠశాల, గుంటూరు సీనియర్ సన ఫాతిమా ఎమ్.సి.యు.పి.పాఠశాల వినోభానగర్, గుంటూరు జూనియర్.

## రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ఘనంగా సైన్స్ దినోత్సవం

- సైన్స్ పితామహుడు సర్ సివి రామన్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి
- సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా మూఢనమ్మకాల నుండి దూరం అవ్వవచ్చు
- ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే మానవుడు సుఖమైన జీవితం గడుపుతున్నాడు. రామకృష్ణ హైస్కూల్ కరస్పాండెంట్ అపర్ణ



రేపల్లె, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే మానవుడు సుఖవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడని రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ అపర్ణ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శుక్రవారం రేపల్లె పట్టణంలోని రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కుర్ర అపర్ణ మాట్లాడుతూ పాఠశాలలో విద్యాభ్యాసం అంటే కేవలం తరగతి గదికి పరిమితమై వినటం చూడటం కాకుండా స్వయంగా చేయడం ద్వారా ఎక్కువ విషయం అవగాహన అవుతుందన్నారు. విద్యార్థులు స్వయంగా చేసిన ప్రాజెక్టుల వలన వారిలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెరుగుతాయి అన్నారు. సైన్స్ మానవ శ్రేయసుకు దోహదపడేలా భవిష్యత్తు పరిశోధనలు సాగాలని ఆమె ఆకాంక్షించారు. సైన్స్ తో పాటు సామాజిక శాస్త్రాలను కూడా క్షుణ్ణంగా చదవటం ద్వారా సైన్స్ యొక్క అభివృద్ధి ఫలాలు మానవులకు సరైన రీతిలో అందుతాయి అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి శాస్త్రీయ వైఖరిని కలిగి ఉండి మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని కోరారు. హేతువాద దృక్పథం పెంపొందించేందుకు సైన్స్ దోహదపడుతుందన్నారు. సైన్స్ ను మనం మంచిగా ఉపయోగిస్తే మంచి చేస్తుందని చెడుకు వాడితే మరింత నాశనం తప్పదని అన్నారు. సైన్స్ పితామహుడు సర్ సివి రామన్ ను నేటితరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అపర్ణ కోరారు. హైస్కూల్ విద్యార్థులను నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్లో పలు రకాల ప్రాజెక్టు మోడల్స్ ను ప్రదర్శించారు. సైన్స్ అవగాహన వాళ్ళ నమ్మకాల నుండి దూరం అవుతారని తరచు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థిని విద్యార్థులలో అవగాహన శక్తి విజ్ఞానం కొత్త విషయాలు నేర్చుకోవాలని ఆసక్తి మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పొన్నూరు అంజుమన్- ఏ -ఇస్లామియా వెల్ఫేర్ సొసైటీ నూతన అధ్యక్షులుగా షేక్ మహమ్మద్ మాము



పొన్నూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : పొన్నూరు అంజుమన్-ఏ -ఇస్లామియా వెల్ఫేర్ సొసైటీ నూతన గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన షేక్ మహమ్మద్ మాము.ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలుతెలియజేసిన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ జాఫర్ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పొన్నూరు. నాయకులు భాష.

## సేవ్ బర్డ్స్ : పక్షుల దాహార్తిని తీర్చేందుకు సెల్ఫీ విత్ వాటర్ ఫర్ ఛాలెంజ్



పొన్నూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చేందుకుమన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ రీతిలో ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది సేవ్ బర్డ్స్ వాటర్ పేరుతో చేపట్టిన కార్యక్రమాల్లో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమల శెట్టి ఉమాశంకర్ ఛాలెంజ్ సేకరిస్తూ వారి కుమారుడు మేఘనాథ్ కు ఇచ్చారు అనంతరం మాశంకర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై మట్టి పాత్ర లేదా గిన్నెలో నీరు పోసి ఆహార గింజలను అందించి పక్షుల దాహార్తి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరు ఛాలెంజ్ను స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు ప్రతి ఒక్కరూ పక్షుల ప్రాణాలు కాపాడేందుకు మన పునరు బ్లడ్ ప్రెషర్ అసోసియేషన్ శేఖర్టిన యజ్ఞంలో భాగస్వాములుగా చేరి మన లోనిమానవత్వాన్ని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు ఈ ఛాలెంజ్ స్వీకరించిన వారు ఫొటోస్ తీసి ఈ నెంబర్కు పంపించండి 8333089722.

## బడ్జెట్ రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునాదిలా నిలుస్తుంది

### మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు



కంచికచర్ల, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునాదిలా నిలుస్తుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి కోగంటి బాబు తెలిపారు. రాష్ట్ర గతిని, స్థితిని మార్చే సానుకూల, ప్రగతిశీల బడ్జెట్ గా కోగంటి అభివర్ణించారు. రూ.3,22,359 కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్ స్వర్ణాంధ్ర 2047 విజన్లోని 10 సూత్రాల లక్ష్య సాధనకు వారధిగా నిలుస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేలా సూపర్ సిక్స్ పథకాలకు కూటమి ప్రభుత్వం బడ్జెట్లో సహేతుక కేటాయింపులు జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ కోసం, తల్లికి వందనం పథకం కోసం భారీగా నిధులు కేటాయించడం శుభ పరిణామం అన్నారు. సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న వెనుకబడిన తరగతులైన బీసీ సోదరుల సంక్షేమానికి, దేశానికి అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్లో వ్యవసాయ రంగాన్ని నిలబెట్టేందుకు, అత్యంత కీలకమైన జలవనరుల శాఖకు నిధులు కేటాయించటం గొప్ప విషయం అన్నారు. విద్యార్థుల భవిష్యత్ను తీర్చిదిద్దే కీలకమైన విద్యాశాఖకు, ఎస్సీల సంక్షేమానికి, ఎస్టీల సంక్షేమానికి, మైనారిటీ సోదరుల కోసం కోట్లాది రూపాయలు బడ్జెట్లో కేటాయించారన్నారు. ప్రజలందరి సహకారంతో స్వర్ణాంధ్ర 2047 విజన్ ను సాకారం చేసుకునే దిశగా ఈ బడ్జెట్ ఉండటం శుభపరిణామం అని కోగంటి తెలిపారు. ఇంతటి ప్రజారంజక బడ్జెట్ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవకు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కోగంటి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# "నేషనల్ సైన్స్ డే "సెలబ్రేషన్స్ 2025




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) శ్రీకాకుళం నందు ఈరోజు కళాశాలలోని సైన్స్ విభాగం వారు "నేషనల్ సైన్స్ డే" కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ–నిత్య జీవితంలో ఉన్న సమస్యలు, అనగా నీటి కాలుష్యము, ఆహారపు కల్తీ, వంటి వాటికి శాశ్వత పరిష్కారాలు కనుగొనే దిశగా సైన్స్ పరిశోధనలు కొనసాగాలని తెలియజేస్తూ ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని అన్నారు. తరువాత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు (మాజీ వైస్ ఛాన్సలర్, ఆంధ్ర యూనివర్సిటీ) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ –2047 భారత్ వికసిత్ భారతదేశంగా రూపొందించడానికి దేశ యువత ప్రధాన పాత్ర పోషించాలని, విద్యార్థులంతా విజ్ఞాన శాస్త్ర రహస్యాలను ఛేదించడానికి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సైన్సు ప్రాజెక్టులు మరియు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లను ప్రదర్శించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.శంకరనారాయణ, అకాడమిక్ కో ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని భౌతిక శాస్త్రం వారైనా డాక్టర్ టి.స్వర్ణలత, కెమిస్ట్రీ శాఖ వారైనా డాక్టర్ పి.సూర్య సునీత, మైక్రో బయాలజీ శాఖావారైన డాక్టర్ పి.లలిత మొదలైన వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని సైన్స్ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం-2025




**కాకినాడ, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం మరియు భౌతిక, రసాయన శాస్త్ర, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ మరియు జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం 2025 కార్యక్రమం ఘనంగా జరిగింది. సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని "కాంతి" పై పరిశోధన జరిపి 1930లో నోబెల్ బహుమతి అందుకున్నారు. 1986 నుండి ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. ఈ సందర్భంగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్కరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అభ్యసించినప్పుడే పరిపూర్ణ విజ్ఞానవంతులు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ ఐడిఎ కార్యదర్శి, శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల వ్యవస్థాపకులు మరియు ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుండాలని అన్నారు. నూతన ప్రయోగాలను చేసి ఆవిష్కరణలు జరిపేలా ప్రయత్నాలు చేయాలని సామాన్యులకి అవసరమైన ప్రయోగాలు అందించాలని అన్నారు. విద్యార్థులు గొప్ప పరిశోధకులుగా, శాస్త్రవేత్తలు రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులను ముఖ్య అతిథి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అభినందించారు. విజేతలకు జ్ఞాపికలను మరియు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సైన్స్ విభాగాల అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇంచార్జి మూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వి ఎస్ ఎన్ కుమార్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తేజేశ్వరరావు, గౌరిప్రియ, తదితర సైన్స్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.కమల కుమారి బదిలీ




**కాకినాడ రూరల్, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా సుమారు నాలుగు సంవత్సరాలు అత్యుత్తమ సేవలు అందించిన ప్రొఫెసర్ ఎం.కమల్ కుమారి బదిలీ సందర్భంగా, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు, మరియు సిబ్బంది ప్రొఫెసర్ ఎం.కమల కుమారి విశిష్టమైన సేవలను కొనియాడారు. ఆమె నాయకత్వంలో క్యాంపస్ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధన కార్యక్రమాల విస్తరణ వంటి అనేక రంగాలలో విశేష పురోగతి సాధించగలిగామని అందరూ ఉల్లేఖించారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించడంలో, అధ్యాపకులకు మార్గదర్శిగా నిలిచిన విధానంలో మరియు పరిపాలనా వ్యవస్థలో సమర్థవంతమైన మార్పులు తీసుకు రావడంలో ప్రొఫెసర్ ఎం.కమల కుమారి గారి కృషి చిరస్మరణీయం. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కమల కుమారి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్, కాకినాడలో ప్రిన్సిపల్‌గా పనిచేసే అవకాశం పొందడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను అని, ఈ కాలంలో అందరి సహకారం, ఆదరణ, ప్రేమ మర్చిపోలేని అనుభూతిని అందించింది. అని ఇక్కడి విద్యా స్థాయిని మరింత మెరుగుపరచడానికి, విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచేందుకు, మరియు మంచి వాతావరణాన్ని ఏర్పరిచేందుకు అందరి సహకారం. ఇప్పుడు ప్రధాన క్యాంపస్, రాజమహేంద్రవరం బదిలీ సందర్భంగా, ఎంఎస్ఎన్ క్యాంపస్ లోని సహచరులకు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి, ఆయమ్మలకి మరియు విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ప్రిన్సిపాల్ బాధ్యతలు స్వీకరించనున్న ప్రొఫెసర్ ఎస్.ప్రశాంత్ శ్రీ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డా.ఎం.పొచయ్య మాట్లాడుతూ, ప్రొఫెసర్ ఎం.కమల్ కుమారి విధానాలను, ఆమె చేసిన మంచి పనులు గురించి, అలాగే చాలా సందర్భాలలో ఆమె క్యాంపస్ కొరకు చేసిన కృషి తెలిపారు. క్యాంపస్ అభివృద్ధిలో ఆమె చేసిన అసమానమైన కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తు వృత్తిపరమైన జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని అందరూ హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, అధ్యాపక బృందం, విద్యార్థులు, మరియు సంభందిత సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ ఎం.కమల్ కుమారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వృద్ధుల పట్ల ప్రేమగా మెలగాలి : డా.చప్పిడి



**కాకినాడ, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** కాకినాడ జిల్లా అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు మరియు ఉప గవర్నర్ అలై పెంకే గోవిందరాజు అధ్యక్షతన క్లబ్ సభ్యులు అలై నీలపాల శ్రీనివాస్ మిత్రులు యంపరాల చంద్రమోహన్ సతీమణి యంపరాల సూర్యకుమారి 3వ వర్ధంతి సందర్భంగా తూరంగి సూర్య నగర్ జనావళి వృద్ధాశ్రమం నందు వృద్ధులకు భోజనం, పండ్లు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ 106 గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు, విశిష్ట అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డా.చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రేమభావంతో మెలగాలని వయసు పైబడిన వారికి సహజంగానే మతిమరుపు, కోపం లాంటివి వస్తుంటాయని వాటిని పిల్లలు అర్థం చేసుకుని వారిని ప్రేమగా చూసుకోవాలని వారి మీద చిరాకు పడకుండా వారితో ప్రేమగా మెలగాలని అన్నారు. గవర్నర్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతి హెల్పింగ్ హేండ్స్ సేవలు అభినందనీయమని ఈరోజు మూడో వర్ధంతి సందర్భంగా ఇక్కడ వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసిన చంద్రమోహన్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులను భారంగా భావించి వృద్ధాశ్రమాలలోనూ అనాధ శరణాలయాల్లోనూ పిల్లలు విడిచి పెట్టడం చాలా బాధాకరమైన విషయం అని ఏ రోజుకైనా మనం కూడా ఇటువంటి సమస్యలను ఎదుర్కోకుండా ఉండాలంటే మనం మన తల్లిదండ్రులను ప్రేమగా చూసుకున్నప్పుడే మన పిల్లలకు కూడా మన మీద ప్రేమ అనురాగాలు పెరిగి మనల్ని కూడా ప్రేమగా చూసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలాగే మద్దా వికాష్, క్లబ్ కోశాధికారి అలై కొత్త శ్రీరాములు, డిసిఎస్ అలై కిరణ్ కుమార్, ఆర్ సి అలై దుర్గా సుభద్ర, డిసి అలై వనుం ఉపేంద్రనాథ్, మేము సైతం మీకోసం అధ్యక్షులు అలై సిహెచ్ గణేష్, అలై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించేలా బడ్జెట్ రూపకల్పన

## - జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** ఏపీ అసెంబ్లీలో శుక్రవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించేలా ఉందని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన జగ్గంపేటలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ బడ్జెట్ లో వ్యవసాయానికి రూ.48 వేలకోట్లు కేటాయించారన్నారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా తల్లికి వందనం పథకానికి రూ.9407 కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం 6300 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.47,456 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.18847 కోట్లు, రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం 6705 కోట్లు కేటాయించడం శుభ పరిణామం అన్నారు. విద్య, మున్సిపాలిటీలు, తెలుగు భాషాభివృద్ధి వంటి అంశాలపై ఈ బడ్జెట్లో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అలాగే మద్యం వినియోగం తగ్గేలా మద్యపాన వ్యతిరేక ప్రచారం కోసం బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. ఈ బడ్జెట్ స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని సాధించే దిశగా ఉందన్నారు. వికసిత్ భారత్ 2047కు అనుసంధానంగా ఏపీని ప్రగతి పథంలో ముందుకు తీసుకు వెళ్లేందుకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని రమేష్ పేర్కొన్నారు.

# ఆత్మీయుల సమక్షంలో పదవి విరమణ



**విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** ఉద్యోగ విరమణ చేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో సీనియర్ కో ఆపరేటివ్ ఇన్స్పెక్టర్ దున్న లక్ష్మణరావు సత్కరించి వారి సేవలను అభినందించిన విశాఖ జిల్లా అధికారులు. విశాఖ జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘ కాలం ఉద్యోగ విధులు నిర్వహించి ఈరోజు ది.28.02.2025 వ తేదీకి రిటైర్ అయిన దున్న లక్ష్మణరావు సత్కరించి కుటుంబ సభ్యుల సమక్షంలో ఆత్మీయ సత్కారం చేసి అభినందించారు. ప్రభుత్వం నుండి రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అతి త్వరగా ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యాలయ పరిపాలనా అధికారిని కోరడం జరిగింది. పదవీ విరమణ చేసిన అధికారుల భవిష్యత్తు జీవితం ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్య ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో చిరకాలం జీవించాలని ఆకాంక్షించారు.

# ముగిసిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ హాకీ టోర్నమెంట్...విజేతలుగా ఢిల్లీ, ఒడిశా



**కాకినాడ, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** కాకినాడలో గత 14 రోజుల నుంచి సాగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్–2025 పోటీలు శుక్రవారంతో ముగిసాయి కాకినాడలోని జేఎన్టీయూకే గ్రౌండ్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఈ హాకీ పోటీల్లో మహిళా విభాగంలో ఒడిశా, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించగా పురుషుల విభాగంలో ఢిల్లీ, ఆంధ్రా & తెలంగాణ, హర్యానా జట్లు వరుసగా మూడు స్థానాల్లో విజయం సాధించాయి. ఈ సందర్భంగా గ్రౌండ్లో ముగింపు వేడుకలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు మెమొంటోలను, ట్రోఫీలను అందజేశారు. గెలుపొందిన విజేతలకు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ భావన, ఈ కార్యక్రమానికి సహకరించిన ఆయా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

# కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుంది



**జగ్గంపేట, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** దేశంలో మతోన్మాద పాసిస్ట్ పాలన నడుస్తున్న కాలంలో, కార్మిక హక్కులను కాల రాస్తున్నటువంటి మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక రైతు వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నాయి. కార్మికుల పోరాడు సాధించుకున్న చట్టాలను కాదని కేంద్ర ప్రభుత్వం కార్మిక లకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోర్టులను తీసుకొని వచ్చి, కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తుంది. ఇటువంటి తరుణంలో విప్లవ కార్మిక ఉద్యమ నిర్మాణ క్రమంలో 2013లో విడిపోయినటువంటి భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ స్థాయిలో ఒకటిగా 2025 లో ఐక్యం కాబోతున్నాయి. ఆ క్రమంలో రాష్ట్రస్థాయి ఐఎఫ్టియు విలీన సభ రాజమండ్రి మార్చి రెండవ తేదీన పెద్ద ఎత్తున సభ జరగబోతున్నది. ఆ సభను జయప్రదం చేయుటకు జగ్గంపేటలోని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐ ఎఫ్ టి యు, సైకిల్ షాప్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు అనుబంధంల ఆధ్వర్యంలో ఐ ఎఫ్ టి యు విలీన సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఆ సభలు జయప్రదం చేయాలని కార్మికులకు ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మరుకుర్తి ఏసు పిలుపునిచ్చారు. ఈ పోస్టల్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మరుకుర్తి ఏసు, పి వై ఎల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గంటా బాలరాజు, సైకిల్ షాప్ వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్, దుర్గారావు రాంబాబు ఎస్.కె.అన్వీర్, అల్లు శ్రీను, దాదా తదితరులు కార్మికులు పాల్గొన్నారు.



# మీడియా అక్రిడిటేషన్ కార్డుల వ్యాలిడిటీ మరో మూడు నెలల పాటు పొడిగింపు

## - జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**అమలాపురం, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** మీడియా అక్రిడిటేషన్ కార్డుల వ్యాలిడిటీని మరో మూడు నెలల పాటు పొడిగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సమాచార మరియు పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ నుంచి జిల్లాకు సమాచారం అందిందన్నారు. ఈ నిర్ణయం మేరకు అక్రిడిటేషన్ కార్డుల వ్యాలిడిటీని.... మార్చి 01 నుండి మే 31 వరకు (లేదా) కొత్త కార్డులు జారీ చేయడం గాని....ఏది ముందు జరిగితే అప్పటివరకు కార్డుల వ్యాలిడిటీని పొడిగించడం జరిగుతుందన్నారు.

# భాష్యం స్కూల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**జగ్గంపేట, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం):** జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని గల భాష్యం పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సైన్స్ డే యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. భారత భౌతిక శాస్త్రవేత్త సి.వి.రామన్ 1928 ఫిబ్రవరి 28న రామన్ ప్రభావాన్ని కనుగొన్నందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న భారతదేశంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలియజేశారు. ఆయన ఆవిష్కరణకు గాను భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇంచార్జ్ గోవిందరాజు విద్యార్థులకు సైన్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు సత్య కుమార్, కొండబాబు రవికుమార్, ప్రసాద్, మనీషా, మౌనిక, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

# పలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష



గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, త్రాగునీటి సరఫరా సమ్మర్ యాక్షన్ ప్లాన్, పాజిటవ్ పబ్లిక్ పర్సెప్షన్, ఎంఎస్ఎంఈ సర్వే, అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మార్చి నెలలో పెన్షన్ల పంపిణీకి జారీ చేసిన నూతన మార్గదర్శకాలు, రానున్న వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాకు ఇబ్బందుల లేకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజలు అందిస్తున్న అభిప్రాయాలు, ఎంఎస్ఎంఈ సర్వే, ఇండస్ట్రీయల్ పార్కుల ఏర్పాటు పై జిల్లాల వారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి సూచనలు అందించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మీ, డీపీఓ సాయికుమార్, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవరి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మీ పాల్గొన్నారు.

# ఆర్థిక కష్టాల్లో కూడా 3.22లక్షల కోట్ల బడ్జెట్

**పొన్నూరు శాసన సభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్**



పొన్నూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఉపాధి ఉద్యోగ వ్యవసాయ రంగాలకే కాక అన్ని రంగాలు అన్ని ప్రాంతాలు అభివృద్ధికి నాంది పలుకుతూ జరిగిన బడ్జెట్ రూపకల్పనను అభినందించిన ధూళిపాళ్ళ ప్రజపాలనలో ప్రజారంజక బడ్జెట్ ను కూటమి ప్రభుత్వం విడుదల చేసినదని హర్షం వ్యక్తం చేసిన ధూళిపాళ్ళ.

# బద్రీనాథ్‌లో విరిగిపడ్డ మంచుచరియలు

- 32మంది సేఫ్- మరో 25మంది
- ఉత్తరాఖండ్‌లో పెను ప్రమాదం
- విరిగిపడ్డ మంచుచరియలు



ఉత్తరాఖండ్, ఫిబ్రవరి 28 (ఏఎంఎస్) : ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో మంచుచరియలు విరిగిపడగా 25మంది గల్లంతయ్యారు. ఈ ప్రమాదంలో తొలుత 57మంది బీఆర్ఓ సిబ్బంది చిక్కుకుపోయారు. వారిలో 32మందిని సహాయక బృందాలు రక్షించాయి. మిగిలిన వారిని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. మంచు దట్టంగా కురుస్తుండటం వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. బద్రీనాథ్ సమీపంలోని జాతీయ రహదారిపై భారీగా పేరుకుపోయిన మంచు మేటలను సరిహద్దు రహదారుల సంస్థ–బీఆర్ఓ సిబ్బంది తొలగిస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, బీఆర్వో బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తో పాటు ఆర్మీ కూడా రంగంలోకి దిగింది. త్వరలోనే కార్మికులందరినీ కాపాడుతాం" అని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. మంచు చరియల కింద చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు అందుబాటులో ఉన్న ఏ అవకాశాన్నీ వదలొద్దని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సూచించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు సీఎంకు షా ఫోన్ చేశారు. అందుకు సంబంధించిన వివరాలతో ఎక్స్ వేదికగా అమిత్ షా ఒక పోస్ట్ పెట్టారు. "నేను ఉత్తరాఖండ్ సీఎం ధామి, ఐటీబీపీ డీజీ, ఎన్‌డీఆర్ఎఫ్ డీజీతో మాట్లాడాను. హిమపాతంతో కార్మికులపైకి మంచుచరియలు విరిగిపడిన ఘటనకు సంబంధించిన సహాయక చర్యల గురించి ఆరా తీశాను. బాధిత కార్మికులు అందరినీ రక్షించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశించాను. ఎన్‌డీఆర్ఎఫ్‌కు చెందిన మరో రెండు టీమ్‌లను కూడా ఘటనా స్థలానికి పంపనున్నాం" అని షా వెల్లడించారు. మనా గ్రామంలో మంచుచరియల కింద చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి ఆర్మీలోని వివిధ విభాగాలు రంగంలోకి దిగాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ ఘటన వల్ల మనా గ్రామం పరిధిలో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ కు ఉన్న జనరల్ రిజర్వ్ ఇంజినీరింగ్ ఫోర్స్ శిబిరం దెబ్బతిందన్నారు. చమోలీ, ఉత్తర కాశీ, రుద్ర ప్రయాగ్, పిథోర్గఢ్, బాగేశ్వర్ జిల్లాల్లోని 2,400 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలకు రాబోయే 24 గంటల్లో హిమపాతం ముప్పు ఉందంటూ గురువారం సాయంత్రం 5 గంటలకే అలర్ట్ జారీ అయింది. దీన్ని చండీగఢ్‌లోని డిఫెన్స్ జియో ఇన్ఫర్మాటిక్స్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్లో ఉన్న వాతావరణ విభాగం కూడా శుక్రవారం ఉదయం అలర్ట్ ఇచ్చింది. రాష్ట్రంలో 3,500 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రదేశాలకు వర్ష సూచన ఉందని, మంచు కురుస్తుందని తెలిపింది. దీంతో వెంటనే ఉత్తరాఖండ్ రాష్ట్ర ఎమర్జెన్సీ విభాగం నుంచి ఆయా జిల్లాలకు సమాచారం అందింది. అన్ని అలర్ట్‌లు జారీ అయినా హిమపాతం కారణంగా మనా గ్రామంలో ప్రమాదం జరిగింది.

# మంగళగిరి-తెనాలి-నారా కోడూరు మధ్య రోడ్లకు మహర్దశ

- మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో డీపీఆర్ రూపకల్పన పనులు ప్రారంభం
- మంగళగిరి-తెనాలి-నారాకోడూరు మధ్య నాలుగు లేన్లుగా నిర్మాణం
- మంత్రి చొరవతో అభివృద్ధి దిశగా ఆయా ప్రాంతాలు




మంగళగిరి టౌన్, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంగళగిరి – తెనాలి – నారా కోడూరు మధ్య రోడ్లకు మహర్దశ పట్టింది. ఇప్పటికే గుంటూరు జిల్లాలో కీలక రోడ్లు, ప్రజలు నిత్యం రాకపోకలు అధికంగా సాగించే మార్గాలైన తెనాలి – గుంటూరు వయా నారా కోడూరు, తెనాలి – విజయవాడ వయా మంగళగిరి రహదారుల విస్తరణకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. తెనాలి నుంచి గుంటూరు మార్గంలో నారా కోడూరు వరకు, తెనాలి – విజయవాడ మార్గంలో మంగళగిరి హైవే వరకు 4 లైన్లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో అధికారులు డీపీఆర్ రూపకల్పన పనులు ప్రారంభించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గుంతల రోడ్లతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మంగళగిరి నుంచి నారా లోకేష్ అత్యధిక మెజార్టీతో గెలవడంతో ఈ ప్రాంత రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. అనతి కాలంలోనే ఆయా గ్రామాల మధ్య తారు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి – తెనాలి– నారా కోడూరు మధ్య 40.05 కి.మీ రహదారులను నాలుగు వరుసలకు విస్తరణ కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీ పనులను శుక్రవారం ప్రారంభించడం జరిగింది. ఇందు కోసం ప్రభుత్వం రూ. కోటి 12 వేలు విడుదల చేసింది. దీనితో అధికారులు, ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి డీపీఆర్ నివేదిక సిద్ధం చేస్తున్నారు. విస్తరణకు అవసరమైన కొలతలు సేకరిస్తున్నారు.

# 10వ తరగతి పరీక్షలు ఎటువంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలి : లింగేశ్వరరెడ్డి




గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని శ్రీ యస్.ఆర్. శంకరన్ కాన్ఫరెన్స్ హాలు నందు గుంటూరు జిల్లాలో జరగబోయే పదవ తరగతి మార్చి-2025 జరిగిన చీఫ్ సూపరింటెండెంట్లు మరియు డిపార్టుమెంట్ ఆఫీసర్ల సమావేశము జరిగింది. ఈ సమావేశమునకు గుంటూరు పాఠశాలల ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, బి.లింగేశ్వరరెడ్డి ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షలు పకడ్బందిగా, పారదర్శకంగా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలన్నారు. డీఈవో సి.వి. రేణుక మట్లాడుతూ, జిల్లాలో 150 పరీక్షా కేంద్రాలలో 30,460 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు మరియు డిపార్టుమెంట్ ఆఫీసర్లు పరీక్షల నిర్వహణ పట్ల అప్రమత్తంగా వుండాలని, ఇన్విజిలేటర్లు ఎటువంటి పొరపాట్లు చేయకుండా ఒక రోజు ముందుగానే ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్షలలో ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని, పరీక్షా కేంద్రాలలో ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్షలు రాయకూడదని అందరికి పర్నీచర్, మంచి నీరు, విద్యుత్ వసతులు కల్పించాలని ఈ విషయంలో ఉప విద్యాశాఖాధికారులు మరియు మండల విద్యాశాఖాధికారులు పరీక్షా కేంద్రలు తనిఖీ చేసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం పరీక్షల విభాగం అసిస్టెంట్ కమీషనర్, కె. వెంకరెడ్డి, డి.సి.ఇ.బి. సెక్రటరీ ఎ. టిరుమలేష్, ఉప విద్యాశాఖాధికారులు, ఏసురత్నం, శంతకుమారి మండల విద్యాశాఖాధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# బడ్జెట్ పై ధన్యవాదాలు తెలిపిన పెమ్మసాని



గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : 2024 - 25 రాష్ట్ర బడ్జెట్లో గుంటూరు ఛానల్ కు నిధులు కేటాయింపు పై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీడియా మిత్రులకు ముందుగా ధన్యవాదాలు. ముఖ్యమంత్రి 2024 - 25 రాష్ట్ర బడ్జెట్లో ప్రవేశపెట్టిన గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులను కేటాయించడంపై కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. గుంటూరు పార్లమెంట్లో 50 ఏళ్ల కల అయిన గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ కోసం టిడిపి ప్రభుత్వం 2014 – 19 మధ్యలోనే బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించింది. తిరిగి మేము మళ్లీ వచ్చిన తర్వాత గడిచిన ఎనిమిది నెలల కాలంలో మరిన్ని వివరాలు సేకరించి, నూతనంగా డి పి ఆర్ లు తయారు చేయించి, నిధులు కేటాయింపజేయడంలో విజయవంతం అయ్యామని చెప్పడానికి గర్విస్తున్నాము. రాష్ట్రంలో అధికంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ. 100 కోట్లు భూ సేకరణకు, విస్తరణకు రూ.300 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి కేటాయించారు. 48 వేల ఎకరాలు భూ సేకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ కి, ముఖ్యమంత్రికి,నారా లోకేష్ కి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ ప్రాంతవాసులకు ఈ ఛానల్ ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆధునికీకరణకు మరో రూ.650 కోట్లకు ప్రతిపాదనలు పెడుతున్నాము. రాబోయే ఎన్నికల్లోపు ఆ విస్తరణతో పాటు ఆధునికీకరణ పనులు కూడా పూర్తి చేస్తామని ఈ విధంగా స్పష్టం చేస్తున్నాం. నీటి సరఫరా ఇబ్బందులపై పరిష్కారం : గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో తెలంగాణ నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకు కొద్ది రోజుల క్రితం నీటి సరఫరాను ఇరిగేషన్ అధికారులు నిలుపుదల చేశారు. ఈ ఫలితంగా రైతులు ఆందోళన చేశారు. అనంతరం రైతుల సమస్యలు వివరిస్తూ అధికారులతో మాట్లాడగా, కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి 1200 క్యూసెక్కులను తీసుకు రాగలిగాం. మాకు సహకరించిన నిమ్మల రామానాయుడుకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఒక సమర్థవంతమైన పాలన ఉన్నప్పుడు ప్రభుత్వం ఎలా పనిచేస్తుంది, ఇంట్లో కూర్చుని కబుర్లు చెబుతూ, ఒక అసమర్థ పాలన ఎలా నడిచింది అనేది ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి ఒక ఉదాహరణ. రూరల్ డెవలప్మెంట్ శాఖ నాకు సంబంధించిందే కాబట్టి ఇండియా మొత్తం మీద ఏ ప్రభుత్వం అయితే ఆయా పనులను వేగవంతంగా చేస్తుందో ఆ రాష్ట్రానికి ఇన్సెంటివ్ కింద నిధులు అందజేస్తారు. నేను కేంద్ర ప్రభుత్వం లో ఉండడంవల్ల రూరల్ ల్యాండ్ రికార్డ్స్, అర్బన్ ల్యాండ్ రికార్డ్స్ ను డిజిటలైజ్ చేయడం వలన ఆంధ్రప్రదేశ్ కు రు. 400 కోట్ల ఇన్సెంటివ్ అందింది. అలాగే ఫార్మర్స్ రిజిస్టర్ చేయడం వల్ల మరో రూ.75 కోట్లు ఆంధ్రప్రదేశ్ కు అందిపుచ్చుకోగలిగాం. ఇతర ఏ రాష్ట్రాలు రూ.50–75 కోట్ల కంటే ఎక్కువ తీసుకురాలేకపోయారు. ఆ నాలుగైదు వందల కోట్లు తీసుకురాగలిగాం కాబట్టి, మా గుంటూరు ఛానల్ కు ప్రస్తుతం కేటాయించిన నిధులను కేటాయించాలని కోరడంతో తెచ్చుకోగలిగామని వివరిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు ధూళిపాల నరేంద్ర కుమార్, మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేసేలాగా రాష్ట్ర బడ్జెట్

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేసే లాగా రాష్ట్ర బడ్జెట్ ఉన్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ,ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ లో సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు సమ ప్రాధాన్యత ఇచ్చినదన్నారు. గడిచిన 5 ఏళ్ళ కాలంలో వైసీపీ చేసిన విధ్వంసాల నుంచి వికాసం వైపు నడిపించే నాయకుడు చంద్రబాబు నాయుడు అని, ఆయన విజన్ ను ప్రతిబింబించేలా రాష్ట్ర బడ్జెట్ రూపొందించారని ఎమ్మెల్యే కొనియాడారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉన్నదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, రైతులు, మహిళలను ఆర్థికంగా పైకి తీసుకొని వచ్చేలా బడ్జెట్ కేటాయింపులు చేశారన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన 73 పథకాలను కూటమి ప్రభుత్వం పున:ప్రారంభించిందని, సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ఎన్టీఆర్ భరోసా, దీపం – 2.0 పథకాలకు రూ.31,613 కోట్లు విడుదల చేసి ప్రజలకు అండగా నిలబడిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్నదాత సుఖీభవ పథకానికి బడ్జెట్ లో రూ.6,300 కోట్లు కేటాయించినదని, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ఈ బడ్జెట్ లో రికార్డు స్థాయిలో రూ.4,332 కోట్లు కేటాయించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. 2025 – 26 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు 'తల్లికి వందనం' కింద రూ.15 వేలు ఇవ్వబోతున్నామని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమానికి రూ.47,456 కోట్లు కేటాయించారని, చేనేత, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్‌కు రూ.450 కోట్లు కేటాయించారన్నారు. ఆదరణ పథకం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పునరుద్ధరించటం బిసిలకు ఆపన్న హస్తం అందించటమేనని, దీనికి బీసీల తరపున ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# ఏఎన్ యు లో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం



గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ,వికాస ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సన్మాన గ్రహీతల సేవలను కొనియాడటం జరిగినది. ఈ కార్యక్రమములో వి సి ప్రొఫెసర్ కె. గంగాధర రావు, రెక్టార్ ప్రొఫెసవర్ కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలంతో పాటు వికాస అధ్యక్షులు యన్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జె. శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు డి. విజయ ప్రకాష్ బాబు, సంయుక్త కార్యదర్శి టి. వెంకటేశ్, కోశాధికారి కె. యేషయ్య మరియు కార్యనిర్వాహక సభ్యులు కె. శశిధర్, యన్. వెంకటేశ్వర్లు, యన్. శ్రీనివాస రావు, జి. శ్రీను మరియు పి. నాగరాజు మొదలైన వారు పాల్గొన్నారు.

# ఎయిమ్స్ లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం: పెమ్మసాని



గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధిపై ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధిపై పెమ్మసాని ఆధ్వర్యంలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు.

ఎయిమ్స్ అందిస్తున్న ట్రీట్మెంట్ గురించి పేషెంట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎయిమ్స్ లో సదుపాయాలు పెంచడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

# ప్రభుత్వం పౌర సేవలు అందిస్తుంది: జిఎంసి కమిషనర్




గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రారంభించిందని గుంటూరు కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగకుండా, వారి అవసరాలకు అనుగుణంగా సేవలు ఇంటి దగ్గర నుంచి అందించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం పౌర సేవలు అందిస్తోందన్నారు.

# జి జి హెచ్ కు వితరణ




గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : ప్రభుత్వ సమగ్ర వైద్యశాల గుంటూరు నందు షాపర్స్ స్టాప్ (ఫియోనిక్ మాల్) వారు 250 కేజీ ల రైస్ (బియ్యం) 30 దుప్పట్లు, జి జి హెచ్ లో ఉండే పేషెంట్లు కి వితరణ చేసారు.

ఈ కార్యక్రమం లో షాపర్స్ స్టాప్ జోనల్ హెచ్ ఆర్ హెడ్ హరి ప్రసాద్,సుధ శ్రీ, గుంటూర్ మేనేజర్ సరోజ్ పాండ, అడ్మిన్ వాసు మరియు షాపర్స్ స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు. సూపరింటెండెంట్ డా రమణ యశస్వి వారి యొక్క సేవ కు గాను షాపర్స్ స్టాప్ గుంటూర్ సిబ్బంది నీ,వారి సేవల్ని పేరు పేరునా ప్రససించారు.

# ఎన్నికల హామీలను నెరవేర్చేలా బడ్జెట్ రూపకల్పన

- బీసీల బడ్జెట్ : మంత్రి ఎస్.సవిత హర్షం
- బీసీల చరిత్రలో ఎరుగని కేటాయింపులు
- రూ.47,456 కోట్లు కేటాయింపు
- 5 ఏళ్లలో బీసీలకు జగన్ వెచ్చించింది రూ.1,36,379 కోట్లే
- 2 ఏళ్లలో రూ. 86,464.17 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు
- వెయ్యి కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ
- కాపులకు రూ.4,890 కోట్లు...ఈడబ్ల్యూఎస్ కు రూ.10,619 కోట్లు
- నేతన్నలకు, నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్
- సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావులకు ధన్యవాదాలు : మంత్రి సవిత



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలకు వెన్నుదన్నుగా నిలిచే బడ్జెట్ అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. రూ.వెయ్యి కోట్లతో ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బీసీలకు అత్యధిక కేటాయింపులు చేసిన బడ్జెట్ ఇదేనంటూ సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావుల కేశవ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా రూ. 3,22,359 కోట్లు భారీ బడ్జెట్ ను మంత్రి పయ్యావుల ప్రవేశపెట్టారన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాల కోసం భారీ ఎత్తున నిధులు కేటాయించారన్నారు. పాఠశాల విద్యకు రూ.31,805 కోట్లు, తల్లికి వందనం పథకం అమలుకు 9,407 కోట్లు కేటాయించారన్నారు. వ్యవసాయానికి 48,340 కోట్లు కేటాయిస్తూ, రైతులతో పాటు బీసీలకూ బడ్జెట్ లో పెద్దపీట వేశారు. ముఖ్యంగా బీసీలకు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కేటాయింపులు చేశారన్నారు. ఉమ్మడి ఏపీలోనూ ఇంత పెద్ద మొత్తంలో బీసీలకు బడ్జెట్ కేటాయింపులు చేయలేదన్నారు. గతేడాది రూ.39,007 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ.47,456 కోట్లు కేటాయించారని, గతేడాది కంటే 8,450 కోట్లు అదనమని తెలిపారు.

### రెండేళ్లలో రూ.86,464 కోట్లు

ప్రస్తుత బడ్జెట్ లో రూ.47,456 కోట్లు, గతేడాది రూ.39,007 కోట్లు...ఇలా రెండేళ్లలో రూ. 86,464.17 కోట్లు కేటాయించారని మంత్రి సవిత తెలిపారు. జగన్ 5 ఏళ్లలో బీసీలకు రూ.1,36,379 కోట్లు కేటాయిస్తే, తమ ప్రభుత్వం రెండేళ్లలోనే 86,464.17 కోట్లు బీసీల అభ్యున్నతికి వెచ్చిస్తోందన్నారు. బీసీల పట్ల సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి తెలిపారు. బీసీలకు కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు దారిమళ్లించిన ఘనుడు జగన్ అని మంత్రి సవిత విమర్శించారు.

### వెయ్యి కోట్లతో ఆదరణ పునరుద్ధరణ

కనుమరుగవుతున్న కులవృత్తులకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. దీనిలో భాగంగా రూ.1000 కోట్లతో ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. 2019 తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ ఆదరణ పథకాన్ని నిలిపేసి బీసీల కడుకొట్టారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు రాకతో మరోసారి ఆదరణ పథకం పునరుద్ధరిస్తున్నామని, కుల వృత్తులకు మంచి రోజులు వచ్చాయని మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు.

### రూ.4,890 కోట్లతో కాపులకు అందలం

బీసీలతో పాటు ఆర్థికంగా ఉన్న వెనుకబడిన కులాలకు కూడా సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు. దీనిలో భాగంగా ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రూ.10,619 కోట్లను బడ్జెట్ లో కేటాయించారన్నారు. ఇందులో కాపులకు రూ.4.890 కోట్లు కేటాయించి, ఆ సామాజిక వర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు సీఎం చంద్రబాబునాయుడు మరోసారి రుజువు చేసుకున్నారన్నారు. ఈబీసీ కార్పొరేషన్ కు రూ.916.77 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ కు రూ.345.45 కోట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ కు రూ.545.05 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్ కు రూ.260.18కోట్లు, కమ్మ కార్పొరేషన్ కు రూ.1,711.42 కోట్లు, రెడ్డి కార్పొరేషన్ కు రూ.1,946.56 కోట్లు కేటాయించినట్లు మంత్రి సవిత వెల్లడించారు.

### నేతన్నకు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మికులకు, నాయీ బ్రాహ్మణులకు, మత్స్యకారులకు ఉచిత విద్యుత్ అందివ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. సెలూన్ షాపులు నిర్వహించే నాయీబ్రాహ్మణులకు కూడా 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.450 కోట్లు వెచ్చిస్తోందని మంత్రి తెలిపారు.

### చేనేతకు రూ.138.08 కోట్లు...

రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తూనే, ప్రస్తుత బడ్జెట్ లో చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం రూ.138.08 కోట్లు కేటాయించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్పుల కింద 3,377 కోట్లు కేటాయించినట్లు ఆ ప్రకటనలో మంత్రి సవిత వెల్లడించారు.

## వ్యవసాయ, అనుబంధ రంగాలలో ఏపీ 8.80 శాతం వృద్ధి రేటు

### ఈ విజయానికి బయోటెక్నాలజీ అనుసంధానం కారణం




గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, అనుబంధ రంగాలలో 8.80 శాతం కాంపౌండెడ్ వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) సాధించడం ప్రశంసనీయమని నిపుణులు పేర్కొన్నారు. ఈ విజయానికి బయోటెక్నాలజీ అనుసంధానం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెరగడం కారణమని విశ్లేషించారు. గుంటూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (అర్ఏఆర్ఎస్)లో నిర్వహించిన వర్క్ షాపులో జన్యుపరమైన ఇంజనీరింగ్, మాలిక్యులర్ బ్రీడింగ్, బయోటెక్నాలజీ నూతన ఆవిష్కరణలపై పరిశోధకులు, నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు చర్చించారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఏఎన్జీఆర్ఏయూ), లామ్, గుంటూరు, బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ (బీసీఐఎల్), న్యూఢిల్లీ సంయుక్తంగా ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐఐ) మద్దతుతో నిర్వహించాయి. ఆంధ్రప్రదేశ్‌లో నీటి లభ్యత సమస్యగా ఉందన్నారు. తరచూ తుఫానులు, వరదలు వస్తున్నాయి. ముఖ్యంగా పెద్ద ఎత్తున సాగు చేస్తున్న వరికి క్సాంతొమోనాస్ ఒరిజే పీవీ. ఒరిజే వల్ల కలిగే బాక్టీరియల్ బ్లైట్ ప్రధాన సవాలుగా మారింది. దీనిని ఎదుర్కొనడానికి ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ, ఐసీఏఆర్-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ప్లాంట్ బయోటెక్నాలజీ (ఐసీఏఆర్-ఎన్ఐపీబీ), ఢిల్లీ పరిశోధకులు ఎంటీయూ 1232 అనే అధిక దిగుబడిని ఇచ్చే.. వరద నిరోధక వరి రకాన్ని అభివృద్ధి చేశారు. 2020 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్రం 46 పైగా వరి విత్తన రకాలను ప్రవేశపెట్టింది. ఇవి పంటల స్థిరత్వాన్ని, ఉత్పాదకతను పెంచాయి. ఇవి వ్యవసాయంలో బయోటెక్నాలజీ పాత్రను మరింత బలపరిచాయి. ఈ సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మి దేవి మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధనకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు. ఎంటీయూ 1232 అనేది బయోటెక్నాలజీ ప్రభావానికి నిదర్శనమన్నారు. యూనివర్సిటీ బయోటెక్ సాధనాలతో విత్తన జాతుల అభివృద్ధిలో ముందుందన్నారు. సబ్ 1ఏ జీన్తో అభివృద్ధి చేసిన ఎంటీయూ 1232.. 10 నుంచి 14 రోజుల వరకు అకస్మాత్తుగా వచ్చే వరదలను తట్టుకుంటుందన్నారు. 50 సెంటీమీటర్ల వరకు నిలిచి ఉండే నీటిలో ఒక నెలకు పైగా జీవిస్తుందన్నారు. దీని మనుగడ 80 శాతం ఉంటుందన్నారు. తీవ్రమైన వరద పరిస్థితుల్లో హెక్టారుకు 3,792 కిలో గ్రాములు, సాధారణ పరిస్థితుల్లో 6,000 కిలో గ్రాముల దిగుబడిని ఇస్తుందన్నారు. ఇది వరద ప్రభావిత ప్రాంతాల రైతులకు మార్గదర్శకంగా నిలవనుందని చెప్పారు. వరి మాత్రమే కాకుండా ఇతర పంటల్లో కూడా బయోటెక్నాలజీ విజయవంతమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ బీటీ పత్తిని స్వీకరించడంలో ముందంజలో ఉందన్నారు. 2023-24లో 4,73,345 మంది రైతులు బీటీ పత్తి సాగు చేశారన్నారు. ఐసీఏఆర్-సీఐసీఆర్ అధ్యయనం ప్రకారం.. బీటీ పత్తి దిగుబడిని ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల మేర పెంచిందన్నారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించిందన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా సలహాదారులు, ఏజీవీఏవైఏ సహ వ్యవస్థాపకుడు రామ్ కౌండిన్య మాట్లాడుతూ వ్యవసాయ సమస్యలను పరిష్కరించేందుకు బయోటెక్నాలజీ కీలకమన్నారు. బయోటెక్నాలజీ ట్రాన్స్‌జెనిక్, నాన్-ట్రాన్స్‌జెనిక్ రెండింటిలోనూ పరిష్కారాలు అందిస్తుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న ఉత్పాదకత అవసరాలకు బయోటెక్ ఆవిష్కరణలు అత్యంత అవసరం అన్నారు. బీటీ పత్తి, జన్యుపరంగా మార్పు చెందిన పంటలు దిగుబడిని పెంచడం, రైతుల జీవనోపాధిని మెరుగుపరిచేలా ఎలా సహాయపడతాయో చూపుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మొక్కజొన్న, వరి, మిర్చి, కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల వంటి పంటలకు బయోటెక్నాలజీ పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహుజా మాట్లాడుతూ బీటీ పత్తి విజయం, రైతులకు కలిగిన ప్రయోజనాలు వివరించారు. 1996లో జన్యుపరంగా అభివృద్ధి చేసిన పంటలు ప్రవేశపెట్టినప్పటి నుంచి మొక్కజొన్న, సోయాబీన్, పత్తి పంటల దిగుబడి పెరిగిందన్నారు. 2012 నుంచి జీనోమ్ ఎడిటింగ్ మరింత వేగంగా, కచ్చితమైన పరిష్కారాలను అందిస్తుందన్నారు. ఇది ప్రిసిషన్ అగ్రికల్చర్‌తో కలిసిపోతే వ్యవసాయ రంగంలో మరో కొత్త దశను ప్రారంభించగలదని చెప్పారు. ఈ సాంకేతికతలు కచ్చితమైన పరీక్షలు, కఠిన నియంత్రణా అధ్యయనాలు పూర్తయ్యాకే అనుమతించబడతాయన్నారు. ఈ వర్క్‌షాప్‌లో జీనోమ్ ఎడిటింగ్, పురుగు, వ్యాధి నిరోధకత, నేల సారం, చిన్న రైతులకు బయోటెక్నాలజీ వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాల గురించి చర్చించారు. బయోటెక్నాలజీ పూర్తి స్థాయిలో ఉపయోగపడటానికి పెట్టుబడులు, విధాన పరమైన మద్దతు, రైతు విద్య చాలా అవసరమని నిపుణులు పేర్కొన్నారు.

## మరిన్ని చిక్కుల్లో గోరంట్ల మాధవ్..

అనంతపురం, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : అత్యాచార బాధితుల పేర్లు బహిర్గతం చేసిన కేసులో వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ నోటీసులు అందుకున్నారు. విజయవాడ సైబర్‌క్రైమ్ పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఆల్రెడీ నోటీసులు అందుకున్న గోరంట్ల.. ఇప్పుడు మరిన్ని చిక్కుల్లో పడ్డారు. ఆయన చేసిన అంతర్యుద్ధం వ్యాఖ్యలపై టీడీపీ, జనసేన సీరియస్ అయ్యాయి. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేశాయి. మాధవ్ మీద చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ జగదీష్‌కు ఆ రెండు పార్టీలు కంప్లయింట్ చేశాయి. రాష్ట్రంలో అలజడులు సృష్టించి.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఫిర్యాదులో తెలిపాయి టీడీపీ, జనసేన. అంతేగాక గోరంట్లపై రాజద్రోహం కేసు వేయాలని డిమాండ్ చేశాయి. గోరంట్ల మాధవ్ గతేడాది చేసిన పలు వ్యాఖ్యలు ఇప్పుడు ఆయన్ను చిక్కుల్లో పడేశాయి. 2024, అక్టోబర్ 21న అనంతపురంలోని తన ఇంట్లో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశారు. కొన్ని ఏరియాల్లో అత్యాచారం, హత్యకు గురైన బాధితుల పేర్లను ఆయన బహిర్గతం చేశారు. దీంతో అదే ఏడాది నవంబరు 2న విజయవాడ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ. సెక్షన్ 23 (4) ఆఫ్ పోక్సో, బీఎన్ఎస్ఎస్ 72, 79 సెక్షన్ల కింద గోరంట్ల మీద కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఇదే కేసులో సైబక్రైమ్ పోలీసులు ఆయన్ను విచారించనున్నారు.

## గవర్నర్ ప్రసంగానికి ఏపీ కేబినెట్ ఆమోదం

- ఆర్థిక విధ్వంసాన్ని అధిగమించేందుకు చర్యలు
- రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడటం వైఎస్సార్సీపీ డీఎన్ఏలోనే లేదన్న మంత్రి పార్థసారథి
- దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా నెలకు 28 వేల కోట్ల రూపాయలు ఖర్చు



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టంచేశారు. జల జీవన్ మిషన్ కింద 7,797 పనులు చేపట్టేందుకు క్యాబినెట్ ఆమోదించిందన్నారు. 9 నెలల కాలంలోనే పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్లుకున్నట్లు వెల్లడించారు. గృహ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వం యూనిట్ కాస్టా 1లక్ష80వేలు చెల్లిస్తే ప్రస్తుతం యూనిట్ కాస్ట్ ను రెండు లక్షల 50 వేలుగా నిర్ణయిస్తూ క్యాబినెట్ ఆమోదించిందన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎస్సీలకు 50 వేలు, ఎస్టీలకు 75 వేలు, బీసీలకు లక్ష రూపాయలు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదించిందన్నారు. గత ప్రభుత్వం పేదవారికి, పెత్తందారులకు పోటీ అని ఎన్నికల ముందు చెప్పి ఎస్సీ, ఎస్టీలకు అదనంగా ఇచ్చే గృహ నిర్మాణ వ్యయాన్ని రద్దు చేసిందని మండిపడ్డారు. 1లక్ష80వేల రూపాయలలో కూడా 30 వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించి మిగిలిన మొత్తం కేంద్ర ప్రభుత్వం నుంచే ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలకు సంబంధించి ఇంకా రాష్ట్రంలో 5.5 లక్షల గృహాలు మొదలు కావాల్సి ఉందని వివరించారు. నిర్మాణాలు అనుకున్న విధంగా పూర్తి కాకపోవటానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం, యూనిట్ కాస్ట్ తక్కువగా ఉండటం, సిమెంటు ధరలు, అదనపు భారమేనని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షాన నిలబడటమే కాకుండా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పూర్తికి చర్యలు తీసుకున్నారని మంత్రి కొనియడారు. ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ఇళ్ల నిర్మాణానికి సాయం అందించటం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 4,135 కోట్ల భారం పడనుందన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని అధిగమించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు రాష్ట్రం కోసం పనిచేయటం లేదని మండిపడ్డారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనకుండా ఒక నాయకుడి మెప్పుకోసం పనిచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలోనే మొదటిసారిగా ప్రతిపక్ష హోదా కావాలని అడగటం చూశానని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడటం వైఎస్సార్సీపీ డీఎన్ఏలోనే లేదని మంత్రి పార్థసారథి దుయ్యబట్టారు. అభివృద్ధి సంక్షేమాన్ని సమతూకంగా ముందుకు తీసుకువెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదవాడి ఆకలి తీర్చే విధంగా అన్న క్యాంటీన్ల ప్రారంభించిన్నట్లు వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నెలకు పెన్షన్లకు 28 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని వివరించారు. సంక్షేమం పేరుతో గత ప్రభుత్వం 10 లక్షల కోట్ల అప్పును రాష్ట్ర ప్రజలపై భారాన్ని మోపిందని మండిపడ్డారు. సంక్షేమం పేరుతో గత ప్రభుత్వం నిధులను దారి మళ్లించిందని మంత్రి పార్థసారథి దుయ్యబట్టారు. పారిశ్రామికవేత్తల విశ్వాసాన్ని గత ప్రభుత్వం కోల్పోయిందని, కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తూ పెట్టుబడులు ఆకర్షించేలా కృషి చేస్తుందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం అన్ని రంగాల్లో విశ్వసనీయతను కోల్పోయిందని ఆరోపించారు. ఢిల్లీకి లెక్కలేనన్నిసార్లు వెళ్లి ఏం సాధించారో కూడా గత పాలకులు చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులు తీసుకురావడంలో సఫలీకృతమైందని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ ఉచిత విద్యుత్!

- ఇకపై చదువుకునే ప్రతి బిడ్డకు తల్లికి వందనం
- అమరావతిలో రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ కు నిర్ణయం
- ఎపి మోడల్ ఎడ్యుకేషన్ దిశగా ప్రభుత్వం అడుగులు
- మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రభుత్వ విద్యకు మహర్దశ



అమరావతి, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : రాష్ట్రంలో రానున్న అయిదేళ్లో ఎపి మోడల్ ఎడ్యుకేషన్ తేవాలన్న మానవ వనరులు, ఐటి, ఎలకానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సంకల్పాన్ని సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తాజాగా శాసనసభలో ప్రవేశపెట్టన బడ్జెట్ లో ప్రభుత్వ విద్యారంగానికి ఊతమిచ్చే పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. రాష్ట్రంలోని 44వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందించాలని ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా స్థానిక సంస్థలపై భారం తగ్గడమేగాక ఉపాధ్యాయులు స్నేహపూర్వక వాతావరణంతో బోధన చేయడానికి ఈ నిర్ణయం దోహదపడుతుంది. టీచర్లు, విద్యార్థులపై వత్తిడి తగ్గి మెరుగైన ఫలితాల సాధనకు ఊతమిస్తుంది. సూపర్ - 6 అమలులో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం 2025-26 విద్యాసంవత్సరం నుంచే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదువుకునే ప్రతి విద్యార్థికి ఈ పథకం కింద రూ.15వేల చొప్పున అందజేస్తారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించే 35.69లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, బూట్లు, పుస్తకాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందజేయనున్నారు. పాఠశాల విద్యకు గత ఏడాది బడ్జెట్ లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.29,909 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది బడ్జెట్ లో కూటమి ప్రభుత్వం 31,805 కోట్లు కేటాయించింది. రిజల్ట్ ఓరియంటెడ్ విద్యావ్యవస్థపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి అధునాతన టెక్నాలజీపై పాఠ్యాంశాలు తీసుకురావడానికి సర్కారు చర్యలు చేపడుతోంది. ఇక ఉన్నత విద్యలో ఇన్నోవేషన్, రీసెర్చికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేసి, ఎపి విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో స్టార్టప్ లకు సహకారం అందిస్తారు. రాష్ట్రంలోని అయిదు జోనల్ కేంద్రాలను దీంతో అనుసంధానిస్తారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలో నైపుణ్యాభివృద్ధికి ఇన్నోవేషన్ హబ్ దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా టాప్ -100 యూనివర్సిటీలో ఎపి విశ్వవిద్యాలయాలు స్థానం పొందేలా చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోంది. మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్, పరిశోధన, పాలిటెక్నిక్ లో క్రెడిట్ ఆధారిత వ్యవస్థ, అధునాతన తరగతి గదులు, ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుతో మన విద్యార్థులను అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తయారుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా బడ్జెట్ లో ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు కేటాయించడమేగాక నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖలకు మరో రూ.1228 కోట్లు కేటాయించారు. దేశంలోనే తొలిసారిగా ఎపి ప్రభుత్వం నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశ్రమల అవసరాలను తీర్చేందుకు రాష్ట్రంలోని 83 ప్రభుత్వ ఐటిఐలలో స్కిల్ హబ్ లను ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటుచేసింది. ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద ప్రత్యేకించి బిసి విద్యార్థుల కోసం 4 కొత్త పారిశ్రామిక శిక్షణా సంస్థలను బడ్జెట్ లో ప్రతిపాదించారు. మొత్తంగా మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు మహర్దశ పట్టబోతోంది.

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా...

## మార్చి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఎస్ .హెచ్.ఓ.లో అత్యంత రాయితీతో మహిళలకు ఆరోగ్య పరీక్షలు

గుంటూరు, ఫిబ్రవరి 28 (సత్యాగ్రహం) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు మహిళల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ ,మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత రాయితీతో మహిళలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమార్ ,పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు లోని 2/1 బ్రాడీపేట లో గల ఎస్ హెచ్ ఓ బిల్డింగ్ లోను, కొత్తపేటలోని ధర్మ భవన్ లో నిర్వహించే ఈ పరీక్షలలో 86 పరీక్షల కంప్లీట్ హెల్త్ చెకప్ తో పాటు మధుమేహం ,థైరాయిడ్ ఎనీమియా ,ప్రెగ్నెన్సీ, ఇన్ ఫెర్టిలిటీ, హిర్సుటీజం ప్రొఫైల్స్ తో పాటు అన్ని రకాల హార్మోన్ పరీక్షలు , అలా సౌండ్ స్కానింగ్, క్యాన్సర్ మార్కర్స్, మెమోగ్రామ్ ,పాప్ స్మియర్, ఎఫ్.ఎన్.ఏ.సి వంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వీటితో పాటు మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ ను నిరోధించే హెచ్.పి.వి వ్యాక్సినేషన్ సదుపాయం కూడా రాయితీ ధరలలో అందిస్తున్నామన్నారు .పరీక్షలు చేయించుకున్న వారికి ఉచిత వైద్య సలహాలు అందజేస్తామన్నారు. అంతేకాక మార్చి 9వ తేదీ ఆదివారం ఉదయం 2/1 బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ సమావేశం మందిరంలో "మహిళల ఆరోగ్య సమస్యలపై శాస్త్రీయ అవగాహన సభ -ఉచిత వైద్య సలహా శిబిరం" నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.


### FORM - IV (Rule 8)

Under the Press and Registration of Books Act, 1867 Statement about ownership and other particulars about Newspaper / periodical "SATYAGRAHAM" Daily.

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | 5-41-18/22, G2, Sai Sudha Aparts., 5/7, Brodipet, Guntur - 2 |
| 2. | Periodicity of Publication | : | Daily |
| 3. | Printer's Name | : | Pothuri Srinivasa Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | 5-41-18/22, G2, Sai Sudha Aparts., 5/7, Brodipet, Guntur - 2 |
| 4. | Publisher's Name | : | Pothuri Srinivasa Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | 5-41-18/22, G2, Sai Sudha Aparts., 5/7, Brodipet, Guntur - 2 |
| 5. | Editor's Name | : | Pothuri Srinivasa Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | 5-41-18/22, G2, Sai Sudha Aparts., 5/7, Brodipet, Guntur - 2 |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one per cent of the total capital. | : | Narayanamma Rayapati 5-41-18/22, G2, Sai Sudha Aparts., 5/7, Brodipet, Guntur- 2 |

I, Pothuri Srinivasa Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
Pothuri Srinivasa Rao
Publisher

Date : 01-03-2025


Printed & Published by Pothuri Srinivasa Rao, Owned by Narayanamma Rayapati, Printed at Sri Kanaka Bhargav Off-set Printers, D.No. 3-154/1, Anjaneya Colony, Reddypalem, GUNTUR-522001. Published at D.No.5-41-18/22, G2, Sai Sudha Aparts, 5/7, Brodipet, GUNTUR-522002. Ph : 0863-2216868, Editor : Pothuri Srinivasa Rao, Cell : 9959956868, RNI : APTEL 2012/47045. e-mail : sgdailygnt@gmail.com